57362

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

నవంబర్ 2, 2008

ELECTION 2008



వైట్ హౌస్‌లో ఒబామా



హ్యాపీబర్త్‌డే

(2008, నవంబర్ 2 నుంచి 2008 నవంబర్ 8 వరకు)

టి. శ్రీనినాద్
1సం॥, నవంబర్-4
జ్యోతి-హనుమంతరావు
వల్లాపురం-ఖమ్మం

వి. వివేక్
3సం॥, నవంబర్-2005
రమ-వీరయ్య
జగన్నాథపురం-నల్లగొండ

సిసింద్రి
నవంబర్
వెంకాయమ్మ-కోటేశ్వరరావు
కామేపల్లివారిపాలెం-ప్రకాశం

అభినయ
1సం॥, నవంబర్-4
భాగ్యరేఖ-నర్సింములుగౌడ్
కంచుకోటవీది-మ॥నగర్

వై. సుకుమర్
1సం॥, నవంబర్-2007
రాజకుమారి-మాణిక్యరావు
కవిటి-శ్రీకాకుళం

కె. కార్తీక్
2సం॥, నవంబర్-8
దీప్తి-మల్లేష్
భద్రాచలం-ఖమ్మం

వై. కార్తికేయ
నవంబర్
నాగశిరోమణి-శ్రీనివాసరావు
విజయవాడ-కృష్ణా

బి. శ్రీకాంత్
నవంబర్
రమాదేవి-బ్రహ్మచారి
ముత్తన్నపేట-కరీంనగర్

జె. సహృతిక
1సం॥, నవంబర్-6
స్వర్ణమాల-కుమారస్వామి
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

పిచ్చుక పునరాగమనం



పిచ్చుకపై బ్రహ్మాస్త్రం. ఎంత చక్కటి తెలుగు సామెత! ఎవరు ఎలాంటి బ్రహ్మాస్త్రం ప్రయోగించారో తెలియదు గానీ పిచ్చుకలు కన్పించకుండా పోయాయి. కొన్నేళ్ల క్రితం వరకు పిచ్చుకలు ప్రతి ఊళ్లోనూ కన్పించేవి. ఇళ్లలోకి వచ్చి కిచకిచమంటూ అల్లరల్లరి చేసేవి. కొన్ని ప్రాంతాల్లో అది ఊర పిచ్చుక, కొన్ని ప్రాంతాల్లో ఊరపిట్ట, కొన్ని చోట్ల గువ్వ. పేరేదైనా మన ఇళ్లల్లో అవి అవిభాజ్యమైన భాగంగా ఉంటూ వచ్చాయి. ఇంటి వాసాల మధ్య, పెంకుల మధ్య గూళ్లు కట్టుకొనేవి. వాసాలు, పెంకులు తగ్గిపోయి క్రమంగా కాంక్రీట్ ఇళ్లు రావడమో, మరేమో తెలియదు కానీ పిచ్చుకలు అంతర్థానమయ్యాయి. ఒక ఊరు, ఒక జిల్లా, ఒక ప్రాంతం అని కాదు అంతటా పిచ్చుకలు కన్పించకుండా పోయాయి. పక్షి ప్రేమికులు విలవిల్లాడిపోయారు. సాధారణ ప్రజలు తీరిక వేళల్లో ఊర పిచ్చుకలను స్మరించుకుని నిట్టూర్చారు. మన వాకిట్లో పిచ్చుకలు గోలగోల చేస్తూ కనువిందు చేసేవని పిల్లలకు చెప్పుకొన్నారు. ఒక తరానికి పిచ్చుక అంటే ఎలా ఉంటుందో తెలిసే అవకాశమే లేకుండా పోయింది. వాకిట్లో, వసారాల్లో కిచకిచమంటూ బిజీబిజీగా సంచరించే చిన్న ప్రాణం పిచ్చుక. దాని సైజు పిడికిలంత, హైరానా మాత్రం బ్రహ్మాండమంత. పిచ్చుకతో పాటు ఊళ్లో కన్పించే మరోపక్షి కాకి. కాకి మీద బోలెడు కథలు. కొన్ని నీతి కథల్లో అదే కథానాయకి. కొన్ని సామెతల్లో అదే వరస్ట్ విలన్. కాకిలా కలకాలం బతికి ఏం లాభం అని ఈసడింపు వినే ఉంటారుగా. అది నిజమేనన్నట్లు కాకికి ప్రమాదం ముంచుకు రాలేదు పాపం. పిట్టలే కన్పించకుండా పోయాయి. మనకి భవిష్యవాణి చెప్పేవారి కొదువలేదు. అందులో కాకి కూడా ఒకటి. చెప్పా పెట్టకుండా ఊడిపడే చుట్టాల గురించి కాకి హెచ్చరిస్తుందని మనవాళ్లకి ఓ గట్టి నమ్మకం. కాకినే అరవకుండా తరిమేస్తే ఇక బంధువుల బాధ ఉండదని మరో భ్రమ. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలంటే అవే మరి. అదేమిటో గానీ పశ్చిమదేశాల్లో కాకులు మన కాకుల్లా అరవవు. కారణమేమని తరచితరచి ఆలోచిస్తే సత్యం సాక్షాత్కరిస్తుంది. పశ్చిమ దేశాల్లో మనలా కుటుంబ వ్యవస్థ ఎక్కడుంది? బంధువుల రాకలూ పోకలూ ఎక్కడివి? ఆఫీసులొదిలితే క్లబ్బులు, పబ్బులు, ఆనక ఎవరి ఇళ్లల్లో వాళ్లు గప్‌చిప్. చుట్టపు చూపులే లేనప్పుడు కాకులకు కావుకావుమనాల్సిన పనేముంది. అందుకే కాకుల లెక్కలు వారికీ ఉన్నా కాకి గోల మాత్రం లేదు. మనదేశంలో దాదాపు రెండు దశాబ్దాల నుండి కాకులు ఒంటరిగా కావుకావుమని బతికేస్తున్నాయి. ఇప్పుడు మళ్లీ పిచ్చుకలు అక్కడక్కడ కన్పిస్తున్నాయి. త్వరలోనే అన్నిచోట్ల కన్పిస్తాయా! ఏమో చెప్పలేం. మళ్లీ మొదలైన పిట్టల కథ పిట్టకథలా ముగియకూడదని కోరుకొందాం.

✻

ఈ సంచికలో....

టపా ... 2

చూద్దామా ... 3

కథ ... 6

కార్టూన్లు ... 9

సినిమా ... 10

రుచి ... 11

బాలనేస్తాలు ... 12

అట్టమీది కథ ... 14

ఇంకా...

ఆరోగ్యం ...8

థైరాయిడ్ సమస్యలు
నివారణా మార్గాలు

ఓ మంచి పుస్తకం ... 18

అవినీతి పడగనీడ
అంతర్జాతీయ సంస్థల క్రీడ

కవిత్వమ్ ... 17

విజ్ఞాన వీచిక ... 20

మనసా... తెలుసా ... 21

కొత్త పుస్తకాలు ... 24

లాహిరిలో ... 22

మన సినిమాల్లో
శాంతి దూత గాంధీజీ





వింత వేడుకలు మనకూ వుంటే ఎంత బావుణ్ణు

వింత వేడుకలు బాగున్నాయి. మన దేశంలో తెలుగువారి ప్రియతమ పర్వదినాలు వచ్చాయంటే కోడి పందాలు, ఎడ్లబండి పోటీలు చూస్తూ ఆనందిస్తాము. స్పెయిన్‌లో టమోటాలతో, నారింజపండ్లతో జరిగే పోటీలు చాలా ఆశ్చర్యంగా ఉన్నాయి. అంతేకాక జున్ను ముక్కల కోసం తహతహలాడే ఆటలు, భార్యను మోసే భర్తలు వంటి ఆటలు చాలా గమ్మత్తుగా ఉన్నాయి. ఇలాంటి విచిత్ర సన్నివేశాలు మన ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉంటే ఎంత బాగుండనిపించింది. వేల సంవత్సరాల గ్లాస్గోలోని చిత్రకళలు, శిల్పాలు, మ్యూజియంలో ఉన్న ఆ ముఖాలు మమ్మల్ని ఆశ్చర్యపరిచాయి. ఓ మంచి పుస్తకం ద్వారా వామపక్షాలు ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న అరవై స్థానాలను ఏ మేరకు పెంచుకుంటాయో ఇప్పుడే చెప్పలేం కానీ ఒక్కటి మాత్రం స్పష్టం అవుతుంది. అదేకాక రాజకీయాల్లో మార్క్సిస్టులు రాటు దేలారు. పార్టీని ఏక తాటిపై తీసుకురావడానికి సిపియంకు ఇప్పుడు మంచి అవకాశం వచ్చింది. విజ్ఞాన వీచికలో అంతర్జాతీయ స్థాయిలో చంద్రయాన్1 ప్రయోగం గురించి తెలుసుకున్నాం. దీని ద్వారా చంద్రునిపై ఉన్న ఖనిజాలను గుర్తిస్తారు. భూమి పైనుండి చూసినప్పుడు మనకు ఎప్పుడూ చంద్రుని ఒక వైపు మాత్రమే కనిపిస్తుంది. భారతదేశం చంద్రునిపైకి ప్రయోగించిన తొలి మానవ రహిత అంతరిక్ష నౌక చంద్రయాన్1 విజయం సాధించాలని కోరుకుంటున్నాము. ఈ వారం 'దక్కేదుంటే' కథ చాలా బాగుంది. రాములమ్మ చెప్పిన మాటలు, యాదగిరి చేసిన పనులు చాలా గమ్మత్తుగా అనిపించింది. డా॥ ఎమ్.ఎస్ రాజు గారికి నా అభినందనలు. గుహలో ఎంతమంచి ఇల్లు కట్టుకున్నారు? గెస్ట్‌హౌస్ లాగా రూపుదిద్దుకున్న ఈ ప్యాలెస్ చూడ చక్కగా ఉంది. ప్రభుత్వం స్థలాలు ఇవ్వకపోతే ప్రజలు ఇలాగే గుహల్లో గూడు కట్టుకునే పరిస్థితి వస్తుంది. ఇది లోపల బంగ్లాలా కనిపించినా బయట చూడటానికి ఒక చక్కటి గార్డెన్‌లా చెప్పుకోవచ్చు. ఆరోగ్యం ద్వారా పొగ దుష్ప్రభావాల గురించి తెలిసింది. మనదేశంలో కోట్లమంది ప్రజలు పొగ తాగడం మూలంగా సున్నితమైన ఊపిరితిత్తులు పాడై గుండె జబ్బుల బారిన పడుతున్నారు. పట్టణాలలో చిత్రాల ద్వారా, వీధి నాటికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను ఈ గుండె జబ్బుల నుండి కాపాడుకుందాం. ప్రమాదకరమైన ధూమపానం, మద్యపానాన్ని అరికడదాం. ఇది యువతకు ఎంతో మేలు చేస్తుంది.

అనుపోజు సత్యనాగరాజు,
విజయనగరం.

గుండె జబ్బులపై అవగాహన కలిగింది

ఈవారం స్నేహలో జీవావరణ వ్యవస్థను కాపాడుకుందాం అంటున్న పతంజలి శాస్త్రి గారి విశ్లేషణ బావుంది. భారతదేశ జీవపరిణామం ఏవిధంగా నడుస్తుందో చాలా చక్కగా వివరించారు. చైనా మాదిరిగా భవిష్యత్తులో జరగబోయే పరిణామాలను ముందుగా ఊహించి భారత దేశ పాలకులు సిద్ధం కావడం లేదని, అనాలోచితంగా అభివృద్ధి పేరుతో పారిశ్రామికీకరణ చేసి జీవ వ్యవస్థలను నాశనం చేస్తున్నారన్నమాట నిజం. చూద్దామాలో గ్లాస్గో విశేషాలు అంటూ చాలా విషయాలు చెప్పారు. స్కాట్లాండ్, క్లైయిడ్‌నది గురించి, అక్కడి మ్యూజియం, గురుద్వారా గురించి తెలుసుకున్నాము. వరకట్నాలు, కన్యాశుల్కాలు లేవని కూడా అర్థమైంది. వినయకుమార్‌గారు చక్కగా వివరించారు. ఆరోగ్యం శీర్షిక చదివాక గుండె జబ్బులపై అవగాహన కలిగింది. అవి ఐదు రకాలని తెలుసుకున్నాము. గుండె జబ్బుల మీద ఆరోగ్యకరమైన సూచనలను మాతో పంచుకున్న స్నేహకి ప్రశంసలు. ఈవారం అట్టమీద కథలో వింత వేడుకలు - విడ్డూరపు చేష్టలు అంటూ పేరేదైనా వీటిని ఇష్టపడని వారంటూ ఉండరని ఎన్నెన్నో తమాషాలను మాకు తెలియచేశారు. వీటన్నింటినీ చదువుతుంటే మాకే ఆ వేడుకలో పాల్గొన్నట్లుగా అనిపించింది. ఈవ్యాసాన్ని అందించిన అంజనగారికి అభినందనలు.

కర్రా వరప్రసాద్, యలమర్రు.

కొత్త ప్రపంచం పరిచయమైంది

అక్టోబర్ 19 నాటి స్నేహ సంచికలో 'అట్టమీది కథ' గా అంజన గారందించిన వింతవేడుకల విశేషాలు ఒక కొత్త ప్రపంచాన్ని మాకు పరిచయం చేసినట్టుగా ఉంది. విజ్ఞాన వీచికలో చంద్రయాన్ గురించి అవగాహన కలిగించారు. మొత్తానికి పోష్ గుహ ఇంటిలో దర్శనమిచ్చిన సకల సౌకర్యాలు కనువిందు చేశాయి. ఆరోగ్యం ద్వారా డాక్టర్ల చేత రాయిస్తున్న వ్యాసాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. 'సమ్‌థింగ్ స్పెషల్' వెరైటీగా ఆకర్షింపచేసింది. తెలంగాణా యాసతో డా॥రాజుగారి కథ "దక్కేదుంటే!" చాలా బావుంది. మనసా... తెలుసా... ద్వారా అనేక సమస్యలకు, సందేహాలకు సమాధానాలు లభిస్తున్నాయి. వినయ కుమార్ గారందించిన గ్లాస్గో విశేషాలు అలరించాయి. వాటిలో వరకట్నాలు, కన్యాశుల్కాలు లేని వారి సంప్రదాయం ఆదర్శనీయమైనది. మనందరం కూడా అతిథి పతంజలి శాస్త్రిగారన్నట్లు జీవావరణ వ్యవస్థను కాపాడు కుందామని ప్రతినబూనదాం!

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.

*

ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగుపొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

వీరి వీరి గుమ్మడి పండు
వీరి పేరేమి?

ఈ ఫోటో ఓ ప్రముఖ నటిది. జవాబు తెలియాలంటే 20వ పేజీలో చూడండి.

చూద్దామా...

అరె! టిబెట్‌కిలా వచ్చామబ్బా?!

కె. అరుణ



ఆ గ్రామంలోకి అడుగుపెడ్తుంటేనే మాలో ఒక అనుమానం పుట్టుకొచ్చింది. అదేంటంటే...కొంపదీసి మనం టిబెట్‌లో ఉన్నామా ఏమిటీ అని! మరేంటీ విచిత్రమని ఆశ్చర్యపోయి, తరచితరచి చూశాక మేం 'టిబెట్‌కాని టిబెట్'లో ఉన్నామని మెలమెల్లగా అర్థమయ్యింది! అదే 'బైలకుప్పె' గ్రామం! 'బైలకుప్పె' కర్నాటకలోని కుషాల్‌నగర్‌కు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. డిస్కవరీ ఛానల్లోనో, మరోచోటో మనం హిమాలయాలు, వాటి పరిసర గ్రామాలను చూసినపుడు గమనించేఉంటాం! అక్కడి కొండలపైనా, ఇళ్లపైనా రంగురంగుల గుడ్డపీలికలు తోరణాలుగాకట్టి వేలాడదీసుంటాయి. అలాంటివే ఇక్కడి ఇళ్లపైనా వేలాడుతున్నాయి. అది బౌద్ధుల నమ్మకమో లేక అది వారి అలంకరణలో భాగమో అయ్యుండొచ్చు. గ్రామంలో కనిపించేవారంతా టిబెట్‌వారే! మళ్లీ వారిలో ఎక్కువశాతం బౌద్ధసన్యాసులే! వారంతా కాషాయం, మెరూన్ వస్త్రాలతో, గుండుతో విభిన్నంగా కనిపిస్తారు! ఎప్పుడన్నా, ఎక్కడన్నా ఇలాంటి సన్యాసుల్ని ఒకరిద్దర్ని చూస్తామేమో! కానీ ఇక్కడ...మన రోడ్లపై మనమెలా తిరుగాడుతుంటామో అలా అరటిపండ్లు కొంటూ...కొబ్బరిబొండాలు తాగుతూ...బైక్ నడుపుతూ...ఫుట్‌బాల్ ఆడుకుంటూ...సెల్‌లో మాట్లాడుకుంటూ...కేవలం బౌద్ధసన్యాసులను చూస్తుంటే చిత్రంగా అనిపించింది.

దీనివెనుక...

1972లో కొందరు లామాలు టిబెట్‌నుండి వలసవచ్చి కుషాల్‌నగర్ సమీపంలో ఆవాసం ఏర్పరుచుకున్నారట. తర్వాత అక్కడొక బౌద్ధారామాన్ని నెలకొల్పారు. అది మెలమెల్లగా చాలామంది టిబెటన్లను ఆకర్షించింది. టిబెట్‌నుండి అనేకమంది ఇక్కడికొచ్చి స్థిరనివాసాన్ని ఏర్పరచుకునేలా ప్రేరేపించింది. ఇప్పుడా బౌద్ధారామంలో 250మంది లామాలున్నారు. వీరికి నివాసం, విద్య, ఆహారం అన్నీ అక్కడే ఏర్పాటుచేయబడ్డాయి. మిగిలిన కుటుంబాలు ఆరామం బయట నివసిస్తున్నాయి. నేడది ప్రముఖ బౌద్ధారామంగా వెలుగొందడమే కాదు, కర్నాటకకే పేరుపొందిన పర్యాటకస్థలంగా మారింది. ఇక్కడ భారతీయ పర్యాటకులతోపాటూ, విదేశీ పర్యాటకులూ ఎక్కువే!

రోజావే..!

అక్కడ వెహికల్ ఆగగానే అంతమంది లామాలు కనిపించేసరికి వాళ్లందరూ మళ్లీ దొరకరేమోనన్నట్లు తెగ ఫొటోలు తీసేశాం. కానీ కాసేపటికే తెలిసింది అక్కడుండే వాళ్లంతా వాళ్లేనని, గుంపులుగుంపులుగా కనిపిస్తూనే ఉంటారని! ఆరామమంతా ఒక పెద్ద ఆవరణలో ఉంది. ఎంట్రన్స్‌గేటు చైనా, సింగపూర్‌లలో కనిపించే 'ఆర్చి'లా నిర్మించారు. లోపలకు అడుగుపెట్టగానే అందమైన పూలతోటలు అక్కడే నిల్చోపెట్టేశాయి. అదేంటో మనిళ్లల్లో ఎంత ఎరువులు వేసి పెంచినా ఒక్క పువ్వు పుయ్యడం గగనమైపోతుంది కదా! (స్థలముంటేనే సుమా!) మరిక్కడ ఏం మాయ చేస్తున్నారో కానీ గులాబీలు

గుత్తులుగుత్తులుగా విరగబూశాయి. అంత పెద్ద గులాబీలు చూస్తే భలే ముచ్చటేసింది. చూపరులందరినీ ఆకట్టుకుని, తమవైపు లాక్కుంటున్న గులాబీలు తుంచి తలలో పెట్టుకోమన్నట్లు తలలూపాయి. అయినా ఏమాత్రం తొందరపడకుండా లోపలికెళ్లాం. అక్కడ లామాల నివాసాలు (అంటే హాస్టళ్లనుకోండి) ఉన్నాయి. అక్కడినుండి చక్కని రహదారిగుండా లోపలికెళ్తే రెండు బౌద్ధాలయాలు కనిపిస్తాయి. మొదటిగా కనిపించే ఆలయం ఎదురుగా ఒక పొడవైన గది ఉంది. దాని నిండా కేరళవాళ్ల ఆలయాల్లో వరసగా దీపాలు వెలిగిస్తారు చూశారా అలా దీపాలు అంచెలంచెలుగా వెలిగించారు. అవి చూడటానికి అందంగా ఉండటమే కాదు, మనసుకు చాలా ప్రశాంతంగా అనిపించింది.



వర్ణరంజితాలు ఆ ప్రాకారాలు!

సరే గుడి దగ్గరికొద్దాం! గుడి అనొచ్చా? దాని పేరే 'గోల్డెన్ టెంపుల్' కదా! గుడిపైన పెద్ద చక్రంలాగా ఒక నిర్మాణం ఉంది. దానిపై సూర్యకాంతిపడి మిరుమిట్లు గొలుపుతుంది. ఎందుకనంటే దానిపైనంతా బంగారపు తొడుగు ఉంది మరి! బైటి గోడలనిండా రకరకాల పెయింటింగులున్నాయి. అవి చూస్తూ అన్ని రంగులతో, అంత లలితంగా కళాఖండాలు తీర్చిదిద్దడం సాధ్యమా అని ఆశ్చర్యపోయాం. అన్నిరకాల వర్ణచిత్రాలున్నాయక్కడ! ద్వారబంధం చక్కని అరుణవర్ణంలో మెరిసిపోతుంది. ఈ ఎరుపురంగు ఆలయమంతటా ఆక్రమించింది. బహుశా బౌద్ధులకు ఎరుపంటే చాలా ఇష్టమనుకుంటా! తలుపులు, పువ్వులు, వర్ణచిత్రాలు ఎక్కడచూసినా అరుణవర్ణమే శోభాయమానంగా వెలుగుతుంది! ఇక ఆలయం లోపలికి వెళ్లాం. వెళ్లినవాళ్లం వెళ్లినట్లే కళ్లప్పగించి ఉండిపోయామంటే నమ్మండి! అది చాలా పే...ద్ద హాల్! హాలు గోడలు, సీలింగు అంతటా రకరకాల వర్ణచిత్రాలే! ఒకదాన్ని మించినదొకటి, ఒకదాన్ని తలదన్నేది మరొకటి! దేన్ని చూడాలో, ఎక్కడనుండి మొదలెట్టి చూడాలో అర్థంకాలేదు! అంత

రమణీయంగా, వర్ణనాతీతంగా ఉన్నాయవి! నిజంగా అలాంటి కళాఖండాలను తీర్చిదిద్దిన కళాకారుల కృషిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాం! వారి సంస్కృతిని, సాంప్రదాయాలను అంత అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రతీదాన్లో చిన్నచిన్న అంశాన్నికూడా మర్చిపోకుండా తీర్చిదిద్దడం ఆశ్చర్యమే కదా! కాకుంటే ఆ దేవుళ్లెవరో మనకర్థంకాదు. అందరూ టిబెట్ దేవుళ్లన్నమాట! కొందరు హిందూ దేవుళ్ల చిత్రాలూ ఉన్నాయి, కాకపోతే వాళ్ల స్టైల్లో ఉంటాయి. మరొకటి! బౌద్ధులకు 'పద్మం' అంటే చాలా మక్కువ! ప్రతీచోటా మనకు పద్మం కనిపిస్తూనే ఉంటుంది.

మొత్తం బంగారమే!

ఆలయమని మొదలెట్టి, గోడలు, వర్ణచిత్రాలు అంటారేకానీ..గుళ్లో దేవుళ్ల గురించి చెప్పరేంటని అనుకుంటున్నారా! ఇదుగో...అక్కడికే వస్తున్నాం! ఆ ఆలయంలో వరసగా ఏడు విగ్రహాలున్నాయి. మధ్యలో బుద్ధభగవానుడిది కాగా, మిగిలినవి టిబెటన్ దేవుళ్లవి. బంగారువర్ణంలో మెరిసిపోతున్నాయవి. ఎందుకంటే ఆ శిల్పాలను రాగితో తయారుచేసి, దానిపై బంగారపు రేకుతో తాపడం చేశారన్నమాట! నిజంగానే చాలా బావున్నాయా శిల్పాలు! చాలాసేపు వాటినే చూస్తుండిపోయాం.

తర్వాత మెల్లగా రెండవ ఆలయంవైపు అడుగులేశాం. అది ముందుకన్నా చాలా పెద్ద హాలు. చాలా ఎత్తుగా కూడా ఉంది! ఇక గోడలు, సీలింగు, కళాఖండాలు, వర్ణచిత్రాలు, రంగుల హరివిల్లులు షరామామూలే! అలాగని విసుగుపుట్టించవు సుమండీ! మళ్లీమళ్లీ కళ్లార్పకుండానే చూస్తాం. ఏదీ మిస్సవకూడదనే తాపత్రయంలోనే ఉంటాం. ఆ ఆలయం మధ్యగా మూడు పెద్ద విగ్రహాలున్నాయి. మధ్యలో బుద్ధుడు (పద్మనాభుడు), అటూ ఇటూ లోకేశ్వర, అమితాభ విగ్రహాలు. మూడు విగ్రహాలు అరవైఅడుగుల ఎత్తుతో అలరారుతున్నాయి. అంత పెద్ద విగ్రహాలనూ బంగారం తొడుగుతోనే చేశారు.



అబ్బ! వాటి సౌందర్యం వర్ణించనలవి కాదు. అంత అద్భుతంగా ఉన్నాయవి! పైగా ఆ విగ్రహాలపై సూర్యకాంతి పడేలా నిర్మించారేమో తళుక్కున మెరిసిపోతూ, కళ్లు చెదిరేలా ఉన్నాయి. తళతళా మెరుస్తున్న విగ్రహాల నీడలు ఎదురుగాఉన్న నున్నటి ఫ్లోరింగ్‌పై పడి ఇంకా మెరిసిపోవడం భలే చూడబుద్ధయింది.

విగ్రహాల మధ్యలో రెండు స్థూపాలున్నాయి. మనకు చైనా, సింగపూర్ అనగానే గుర్తొచ్చే డ్రాగన్లు ఆ స్థూపాలను అల్లుకుని మన కంటిని వాటివైపుకు తిప్పుకుంటాయి. అన్నట్లు ఆ డ్రాగన్లుకూడా బంగారపువే! చూసిన ఆడాళ్లందరూ 'అమ్మో! ఎంత బంగారం? ఎన్ని నగలు చేయించుకోవచ్చ'ని లెక్కలు వేసేసుకుంటున్నారంటే నమ్మండి! విగ్రహాలను చాలావరకూ పూలతో అలంకరించారు. అలంకరణకు ఉపయోగించిన పువ్వులు ప్లాస్టిక్‌వంటే మనమోపట్టాన నమ్మం! అంత ఒరిజినల్‌గా ఉన్నాయవి!

విగ్రహాలను తనివితీరా చూసిన తర్వాత బైటున్న రెండు ప్రార్థనాస్థలాలను కూడా చూశాం. అక్కడ అనేకమంది లామాలు కూర్చుని మన పండితులు మంత్రాలు చదివినట్లే వారి భాషలో ప్రార్థనలు చేస్తున్నారు. రకరకాల వాయిద్యాలు వాయిస్తున్నారు. ఒక రెండు మీటర్లపైన పొడవున్న బూరను(అనొచ్చా?) తలా కాసేపు ఊదుతున్నారు. అది 'బుయ్'మంటూ చేసే శబ్దం విచిత్రంగా వినిపించింది.

అంతా బాగానే ఉందికానీ ఒక్కటే అర్థంకాలేదు. అక్కడున్నవారంతా సన్యాసులైనా (లామాలు) వారి జీవనవిధానం చాలా విలాసంగా ఉంది. పేరుకు సన్యాసులైనా ప్రపంచీకరణ, వినిమయసంస్కృతి అక్కడికీ పాకింది. సన్యాసులందరి చేతిలో సెల్‌ఫోన్లు, బైకులు...ఇలా వారికి లేని సౌకర్యం లేదు. ఇంతింత ఖర్చుపెట్టి ఇంత బంగారంపోసి ఆలయాలు కట్టడానికి, వీరంతా ఇంత వైభోగంగా బ్రతకడానికి వీరికెక్కడినుండి విరాళాలు వస్తున్నాయబ్బా అనే అనుమానం వచ్చింది! మతవ్యాప్తికోసం ఇతర బౌద్ధదేశాలు వీరికి పెద్దమొత్తంలో విరాళాలు పంపుతున్నాయేమో! మొత్తానికి పరాయిదేశానికి వలసవచ్చి ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్నారీ టిబెటన్లు.

అంకితభావమే కారణమా?

ఇలాంటి వాతావరణం ఇంకెక్కడా కనిపించదు. పైగా ఇంతమంది సందర్శకులొస్తున్నా వారు చాలా పరిశుభ్రంగా ఉంచుతున్నారు. చక్కగా నిర్వహిస్తున్నారు. లామాల్లో మతంపట్ల ఉన్న నమ్మకం, నిబద్ధత, అంకితభావమే వారినలా ఉండేలా పురిగొల్పుతుందేమో! లేకుంటే ఈరోజుల్లో కూడా ఇంకా సన్యాసం తీసుకుని బ్రతకడం ఆశ్చర్యం కలిగించే విషయమే కదా! ఒక్కటి చెప్పడం మరిచాను. అక్కడున్నవారంతా పురుషసన్యాసులే సుమా! సందర్శకులు తప్ప అక్కడ ఒక్క స్త్రీకూడా కనిపించలేదు. ఆరామం దాటాక ఉండే ఇళ్లలో మాత్రమే స్త్రీలున్నారు.



కానీ ఒకటి ఆశ్చర్యం! ఈ బౌద్ధులకున్నంత ఓర్పు ఇంకెవరికీ ఉండదేమో! తమ మతాన్ని వ్యాప్తి చేసుకోవడంకోసం ఎలాంటి ప్రదేశానికన్నా, ఎంత దూరమైనా వెళ్లిపోతారు. అవి కొండలు, గుట్టలు, ఆఖరికి సముద్రాలైనా సరే దాటి వెళ్లిపోతారు. ఏమాత్రం వెనుకాడరు. కావాలంటే చూడండి. ముంబయి దగ్గర బోరివల్లిలోని అడవి మధ్యలో 'కన్హేరి గుహలు', ఖండాలా పర్వతాలపైనున్న 'కన్హేరీ గుహలు', అరేబియా సముద్రం మధ్య ద్వీపంలోని 'ఎలిఫెంటా గుహలు'...ఇవన్నీ వారి అంతులేని ఓర్పుకీ, పట్టుదలకూ చిహ్నాలే కదా!

ఇది మన గొప్పదనమే!

ఇదంతా చూశాక ఒకటనిపించింది. మనదేశం ఎంతో గొప్పదని! ఔను! ఎన్నిరకాల మనుషులొచ్చినా, ఎన్నిరకాల సంస్కృతులొచ్చినా మనదేశం తనలో కలుపుకుంటుంది. ఆపదగొని వచ్చినా, వ్యాపారార్థం వచ్చినా, వలసవచ్చినా వారిని అక్కున జేర్చుకుంటుంది. ఆశ్రయమిస్తుంది. చివరకు వారిక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకున్నా, తనకు నష్టం కలిగించబోయినా పెద్ద మనసుతో క్షమిస్తుంది. అది దలైలామా కానివ్వండి, తస్లీమా నస్రీన్ కానివ్వండి! ఇది దేశం గొప్పదనమే కాదు, మన గొప్పదనం కూడా! మనలోని సహృద్భావమే మనల్నా దిశగా ప్రేరేపిస్తుంది. అన్యమతాలను, అన్య దేశస్థులను కలుపుకోగలుగుతుంది. దీన్ని ఇతర దేశాలు అర్థంచేసుకుని మనల్ని నాశనం చేయకుంటే చాలు, అదే మనకు పదివేలు!

కుషాల్‌నగర్‌కెళ్తే చాలా ప్రదేశాలు చుట్టిరావచ్చు. వాటిలో ఓంకారేశ్వర టెంపుల్, రాజాసీట్, దుబేరా ఫారెస్ట్, తలకావేరీ, నిసర్గధామం, హరంగీడ్యామ్ ప్రధానమైనవి. బోనస్‌గా కాఫీ, మిరియాల తోటలు, కొండాకోనలు ఉండనే ఉన్నాయి.

మొత్తానికి ఒక భిన్నసంస్కృతిని, భిన్నరీతిలో సందర్శించినందుకు చాలా తృప్తిగా అనిపించింది. సమయం చిక్కితే తప్పక చూడాల్సిన స్థలమిది! యాత్రలకని చాలాచోట్లకు వెళ్తాం. కానీ వాటిలో మనల్ని ఆకట్టుకునేవి, మనసును ప్రభావితంచేసేవీ కొన్నే ఉంటాయి. అలాంటివాటిలో బైలకుప్పె ఒకటని చెప్పొచ్చు.

*

కథ

చూపుడువేలి నీడలో....

వై.కుసుమకుమారి

చీకట్లు ఇంకా వీడిపోలేదు.ఎందుకో కరువోడికి తెలివొచ్చేసింది. రెక్క విరిగిన కిటికీలోంచి చలిగాలి రివ్వున దూసుకు వస్తుంటే కంబలిలో వెచ్చదనాన్ని ఆస్వాదించసాగాడు. నులకమంచంమీద అటుఇటు పొర్లాడాడు. ఏపక్కకు ఒరిగిపడుకున్నా నిద్రపట్టలేదు. "వేకువజామున తెలివొస్తే మాగొప్ప చికాకు. రోజంతా మగతగా ఉండి ఏపని చేయలేం". అనుకుంటూనే తన మంచంకు దగ్గరలో నేలమీద పడుకున్న భార్య సన్యాసమ్మను చూసి గతుక్కుమన్నాడు. "ఏటే నాలాగే నీకు నిద్దరట్టడం లేదా?" అడిగాడు నవ్వుతూ....

"ఎందుకలా పొర్లుగేదెలా అటుఇటు దొర్లుతావు. ఆయిగా నిద్రపోరాదు. మరో గంట గడిస్తే ఆభూసామి పొలంపనితో రాత్రేళవరకు చావాల. అన్నట్టు కొట్టాంకాడ సిన్నగుంట పాపడ్ని తీసుకురారాదు. ఆ కిటికి ఊడిపోయింది కదా! అది సరిసేయిద్దుం అనిలేదు. ఇప్పుడు నీ నిద్ర కరిగి పోడానికి కారణం ఆఊడిపోయిన కిటికీయే. అందులోంచి ఒకటే రొజ్జగాలి.నాకు ఆసలిగాలికే నిద్ర తేలిపోయింది. అటు సూడు కొడుకు రాజులు ఎలా తొంగున్నాడో ఆడికి ఈసలి కాతరులేదు. ఈడి సంగతి ఏటి ఆలోసించినావు. ఈడికి నీలాగే పొలం పనులకు ఎంటేసుకుని ఎళ్లమాకు అని నెత్తినోరు బాదుకుంతే నీకు సాయమని ఎత్తుకెళ్తన్నావు. ఇక ఈడు నీలాగే పశువు కష్టం సేయాలే."

"ఎందుకే ఏది నోటికి వస్తే అదే వాగుతావ్.ఈడు ఏటి పెద్ద సదువులు సదివీసేడు? ఇప్పటికి టాకటర్ నడుపుతాడు. అది ఎరువులు తేడానికి, దాన్యం మిల్లులకు తీసుకుపోడానికి అంతకుమించి మరేటి సేయగలడే. నువ్వు ఎంతసేపు చిన్నయ్య ప్యాకటరీ పట్టనంలో పెట్టినాడు. అందులో కొలువు సేయించీమంటావు. ఎలా అది సదువుకున్నోళ్లదే."

"నువ్వు ఎర్రిమాలోకానివి. ఒక్కగానొక్క కొడుకు కష్టం మనం సూడలేం అని ఇంగితం నీకు ఉండి ఏడిస్తేకదా. చిన్నయ్య ఎవరు? మనం పనిచేసే పొలం కాపుకొడుకు. మరేటి నీకు అడగడానికి రోగం" కస్సుమంది.దాంతో పక్కనే పడుకున్న కొడుకు లేచి ఇద్దరిని కోపంగా చూసి "మీకు ఏంపోయేకాలం. బంగారంలాంటి నిద్రపాడు చేశారు". అని కళ్లు నులుముకుంటూ కూర్చున్నాడు. సరిగ్గా అప్పుడే తలుపు తట్టిన చప్పుడయ్యింది.

"ఇదిగో ఇప్పుడే లేసినాను పదా పొలంకాడికి వచ్చేస్తాను. పెద్దకాపు లేవలేదుకదా! ఈరోజు ఎలాగైనా మొత్తం పొలాలన్ని మందుకొట్టాల"

"రేయ్ నేనురా పెద్దకాపును" బయటినుంచి విన్పించింది.

మీదున్న కంబలి విసిరికొట్టి ఎగిరి కిందకు గెంతి తలుపు తెరిచి "ఏటయ్యా ఇలా మీరు వచ్చీశారు.ఇదిగో పొలంకు ఎల్తాను." గాభరా పడ్డాడు.

"నీవు ఒక పని చేయాలి. విషయానికి వచ్చేస్తాను. పట్టణంలో ఉన్న నాకొడుకు రాంబాబు సెకెండుషోకి కారులో వెళ్లకుండా మోటార్‌సైకిల్ మీద వెళ్లాడు. వాడు పెట్టుకున్న ఫ్యాక్టరీ రోడ్డులో ఒక యాక్సిడెంటు చేశాడు. అక్కడే బండి వదిలేసి వచ్చేశాడు. పోలీసులు వెతుకుతున్నారు. నువ్వు నీకొడుకుని నాతో పంపితే ఆకేసు పోలీసులు నీకొడుకుమీద రాసుకుంటారు.నేను కోర్టులో బెయిల్‌మీద నీకొడుకును తీసుకు వచ్చేస్తాను. ఆతర్వాత కేసు కొట్టించీదుం".

ఆమాటలకు ఈగుడిసెలో ఉన్న ముగ్గురు బిక్కచచ్చి పోయారు. వారి గుండెల్లో వేగం పెరిగింది. ఎదురు చెప్పడానికి లేదు. కరువోడు కొడుకువైపు చూశాడు. తల్లి అప్పటికే శోకదేవతయ్యింది. రాజులు నేలచూపులు చూడసాగాడు.

> **"అమ్మా నన్నుపెద్దకాపు, వాడికొడుకు గూండాగా మార్చేప్రయత్నం లో ఉన్నారు.త్వరలో నాతో హత్యలు చేయించడానికి కూడావారు వెనుకాడరు.మనం ఈఊరువదిలిపోదాం.ఎక్కడైనా మీరు కోరినవిధంగా నీతిగా బ్రతుకుతాను.అదే ఇక్కడుంటే భయంకరమైన గూండాగా తయారు చేస్తారు.అందుకే వారిచ్చిన పిస్తోలును నాకు జైలులో పరిచయం అయిన ఒక నేరగాడికి ధరతగ్గించి అమ్మేసాను. ఈడబ్బుతో మనం ఇక్కడికి వెయ్యికిలోమీటర్ల దూరంపోయి బ్రతుకుదాం."**

"ఏట్రా వస్తున్నట్టా? లేదా? ఏటి పలకరు ఉలకరు. నీకొడుకుని తీసుకుపోయే ఉరితాడుకి ఏలాడేసేడానికి కాదురా! ఏక్సిడెంటు కేసులో ఏటీ అయిపోదు. ఆచచ్చినోడికి ఇన్సూరెన్సు వస్తాది. ఈడికి నేను ఎంతో కొంత ఇస్తాను. ఈడు ఇంట్లో తిని తొంగోడమేకదా!" ఆమాటలకు జవాబు చెప్పలేకపోయారు.

"ఛస్ ఏట్రోయ్ ధిక్కరిస్తన్నారా! యాక్సిడెంటు సేసింది నాకొడుకు కాదు. మాపాలేరు కొడుకు మోటార్‌బైక్ నడిపాడు అని పోలీసులతో సెప్పీడం జరిగిపోయింది. ఆళ్లు బయల్దేరి వస్తన్నారు. నువ్వు నాకల్లానికి వచ్చీయ్‌రా! అక్కడ ఆళ్లకి లొంగిపోదువుగాని. నిన్ను మద్యాన్నానికి కోర్టుబోనులో నిలబెడతారు. మన వకీలుకు కేసులు లేవని మూడు నెలలుగా అడుగుతునే ఉన్నాడు. ఆడికి అప్పగించేస్తాను. ఆడు ఏటి వాదిస్తాడో నువ్వు చూస్తావుకదా! " చెప్పి ఒకనోట్ల కట్ట వారిమీదకు విసిరాడు. అది రాజులుకు తగిలి నేలమీదపడింది.

"ఓరే వచ్చిన లచ్చిమిని నేలపాలు సెయ్యకురా! తియ్యరా చెత్తనాకొడకా! నువ్వే వస్తేసరి. లేకుంటే పోలీసులు ఇరగదీసి తీసుకు వెళ్తారు." చెప్పి వెళ్లిపోయాడు.

ముగ్గురి మధ్య భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంది. రాజులు కిందకి వంగి నోట్లకట్ట అందుకుని తల్లిచేతిలో పెట్టాడు. "దీన్ని జాగ్రత్తగా దాచమ్మా! ఆపెద్దకాపు నన్ను కేసు మధ్యలో వదిలేస్తే దీన్ని ఖర్చుచేసే నేను బయటకి రావల్సి ఉంటుంది. దీని చుట్టే ప్రజలు తిరుగుతున్నారు. మనం కాపుని కాదని బతికేది లేదు. అతడి చూపుడు వేలినీడలో బ్రతుకుతున్నాం" చెప్పి గబగబా స్నానంచేసి తయారయ్యాడు.

ఉట్టిమీద చల్ది దించి పెట్టుకుని తింటుండగా పోలీసులు వచ్చారు. "ఏరా

అక్కడ బైక్‌తో గుద్దేసి ఇక్కడ తీరుబాటుగా తింటున్నావా?" కాలర్ పట్టుకుని తింటున్నవాడిని లేవదీసుకుని జీపులోకి నెట్టారు.

కొడుకును ఎత్తుకెడుతున్న జీపువైపు దంపతులు కళ్లార్పకుండ చూశారు. ఆతరువాత కుప్పకూలి ఏడ్చారు.

✣ ✣ ✣

మోటార్‌బైక్ ఢీకొని కార్మిక నాయకుడు మృతి అని ఛానల్ చూపిస్తుంటే కరువోడు, సన్నాసమ్మా ఇద్దరు పరుగులు తీసి ఆఊరి చినకాపు ఇంటికి వెళ్లి టీవీ చూశారు. అందులో రాజులు పోలీసుల మధ్య నిలబడి మాట్లాడుతుంటే సన్నాసమ్మ ఊపిరిబిగబట్టి చూసింది.

"రాత్రి మాచిన్నయ్య రాంబాబు కారులో సెకెండ్‌షోకి వెళ్తే ఇంటి వద్ద ఉన్న మోటార్‌బైక్ చెప్పాపెట్టకుండా తీసి పట్టణంలో షికార్లు కొట్టాను. సెకెండాట ఇడిసిపెట్టేస్తారని రాంబాబు కంటేముందే వచ్చేయాలి అని వేగంగా వచ్చేస్తుంటే రోడ్డు దాటుతుండగా ఏక్సిడెంటు అయిపోయింది. నేలమీద అడ్డంగా పడిపోయిన మనిషిని చూసి భయంవేసి బైక్‌వదిలి పారిపోయాను."

ఆతరువాత కార్మికనాయకుడు మైక్‌లో మాట్లాడుతూ కన్పించాడు. "మాసంఘ నాయకుడు సూర్యంను కావాలని చంపే పథకం ఇది. ఇందులో కొత్తగా ఫ్యాక్టరీ ఏర్పాటుచేసుకున్న రాంబాబు వారి ఊరినుంచి ఈ రాజులును రప్పించి ఈఘాతుకానికి ఒడిగట్టించాడు. ఇది యాక్సిడెంటు కానేకాదు. ముమ్మాటికి హత్య" అని పెద్దగొంతుతో చెప్పాడు.

ప్రత్యక్షసాక్షి కథనం మరోలా ఉంది. "రాత్రి నేను అరుబయట ఉన్నప్పుడు ఈయాక్సిడెంటు చూశాను. బైక్‌మీద రాజులును చూడలేదు. రాంబాబునే చూశాను. ఇందులో మనిషిని మార్చేశారు."

మరో సాక్షి కథనం కూడా ప్రసారం అయ్యింది. "నేను కళ్లారా చూశాను. పారిపోవద్దు. ఇద్దరం కలిసి ఆసుపత్రికి తీసుకువెడదాం అని చెప్పినా వినలేదు. పారిపోయాడు ఈరాజులు"

✣ ✣ ✣

మరోరోజు మరికొన్ని కథనాలు, సాక్షులు ఛానల్‌లో కన్పించారు. చివరికి యాక్సిడెంటు డెత్‌గా నమోదు అయ్యింది. హత్యే అని వాగిన కార్మికనాయకుడు మాట మార్చేశాడు. మూడు నెలల తరువాత బెయిల్ మీద రాజులు ఇంటికి వచ్చాడు. తల్లి అనారోగ్యం పాలయ్యింది. ఆమె కళ్లు ఏడ్చిఏడ్చి ఎండిపోయాయి. తండ్రి తెల్లగా పాలిపోయాడు. జైలులో బక్కచిక్కిన కొడుకును చూసి బావురుమన్నారు.

"నాన్నా ఎందుకు ఏడుస్తారు. గ్రామాల్లో పెద్దకాపుల చూపుడు వేలి నీడల్లో బతికే మనలాంటి ఎందరి జీవితాలో ఇలా తెల్లారాల్సిందే. అదేదో యాక్సిడెంటు కేసులో ఇరికించారు. అదే మర్డర్‌కేసు అయితే అకారణంగా శిక్షకూడా అనుభవించాలి." అని తల పట్టుకుని కూర్చున్నాడు.

తల్లి కొడుకు పక్కనే కూర్చుని "నాయనా! మరి ఆరోజు టీవీలో చెయ్యంది ఎందుకు ఒప్పుకున్నావు? ఆరాత్రి ఇక్కడే ఉన్నానని చెప్పకుండా రాంబాబు మోటారుసైకిల్ తీసుకుని వెళ్లి గుద్దేసినాను అనిచెప్పావు. అలా ఎందుకు చెప్పావు "

"పిచ్చి తల్లీ అలా చెప్పమన్నదే పోలీసులు. అంతకు ముందు కార్మికులు పెద్ద ఊరేగింపుగా వచ్చి ఠాణాను చుట్టుముట్టారు. నన్ను అప్పగించితే చంపి పాతరేసి జైలుకెడతాం అన్నారు. పోలీసులు నన్ను రక్షించారు. లేకుంటే వారి కోపానికి నేను బలైపోయేవాడినే. పెద్దకాపు బాగా డబ్బు ఖర్చుచేశాడు. దాంతో కార్మికనాయకుల్లో కొందరు నీరుగారి పోయారు. కేసు పలుచనై చివరికి యాక్సిడెంటు కేసుగా మారింది. నాకు బెయిల్ పిటిషన్ వేయడానికి అందుకే ఆలస్యం చేశారు. ఎందుకంటే కార్మికుల్లో ఒకవర్గం నాపై గుర్రుగా ఉంది. వారు నాకు ఏదైనా హాని తలపెట్టవచ్చని మన రాంబాబే ఊహించి ఇలా చేశాడు. నేను బెయిల్‌మీద వచ్చి అప్పుడే పదిరోజులయ్యింది. రాంబాబు ఇంట్లోనే ఉన్నాను. నాకు రక్షణార్థం ఇదిగో ఈహ్యాండ్‌గన్ లక్షన్నర రూపాయాలు పెట్టి కొని ఇచ్చాడు."తీసి చూపించాడు. నల్లగా నిగనిగలాడే పిస్తోలును అటుఇటు ఆడించాడు.



తల్లితండ్రి ఇద్దరు దాన్ని చూసి ఠారెత్తిపోయారు. నోటమాటరాలేదు.

"ఏమిటి భయపడుతున్నారా? దీన్ని పేల్చడం వచ్చు. నన్ను చంపాలనుకున్నవాడిని నేను చంపేయాలి తప్పదు."

ఆమాటలు విని భోరున ఏడ్చారు తల్లితండ్రులు.

"ఎందుకిలా మీరు అయినదానికి, కానిదానికి ఏడుస్తారు? గన్ అనేది రాంబాబు వద్దలేదు. అంతెందుకు మన పెద్దకాపువద్దలేదు. అంటే వారి కంటే నేనే గొప్ప. నాప్రాణం విలువ చాలా ఎక్కువే ఉన్నందున రాంబాబు గన్ కొని నాచేతిలో పెట్టాడు. ఖర్చు చేయమని ఈపదివేల కట్ట ఇచ్చాడు. ఇంతకంటే పెద్దఉద్యోగం ఏముంటుంది." ఆడబ్బులో కొన్నినోట్లు తల్లిచేతిలో పెట్టాడు.

"నాయన మంచిగా బ్రతికితే చూడాలనుకున్నాను. నెత్తురుకూడు నాచే తినిపిస్తున్నావు."చెప్పి లేచింది.

"అమ్మా వాస్తవానికి రాంబాబు కూడా యాక్సిడెంటు చేయలేదు. ఒక కిరాయి మనిషిచే చేయించాడు. వాడు బైక్‌తో పారిపోవాల్సింది అడ్డదిడ్డంగా పడిపోవడంతో లేచి చిన్న గాయాలతో ఆరోజే పారిపోయాడు. స్పాట్‌లో మోటార్‌బైక్ దొరికిపోయింది. అందుకే ఇంతకేసు అయ్యింది. పైగా ప్రత్యక్షసాక్షులు ముగ్గురు నన్ను చూసినట్టు కోర్టులో చెప్పలేదు. యాక్సిడెంటు చేసినవాడు మరోలా ఉంటాడన్నారు. దానిపై పోలీసులు వేరేవాడికోసం వెతుకుతున్నారు. నేను తొలుత ఒప్పుకున్నందున మూడుమాసాలు జైలు పాలయ్యాను." చెప్పి నులకమంచంమీద చేరబడ్డాడు.

సెల్ మ్రోగింది. తల్లితండ్రులు అదిరిపడ్డారు. జేబులోంచి సెల్‌తీసి చెవికి అదిమాడు. "నేనే భయ్యా! రాజును మాట్లాడుతున్నాను. డబ్బు రెడీ చేశావా? సరుకు సిద్ధంగా ఉంది. ఏమిటి మాఊరు వచ్చావా? ఎక్కడున్నావు? ఊరు మొదల్లోనే ఉన్నావా అయితే నీకు కన్పించే గుడిసెకు వచ్చేయ్ అదేరా మాఇల్లు." చెప్పి సెల్ ఆపేసి లేచి నిలబడ్డాడు.

మోటార్‌బైక్‌మీద ఒకడు వచ్చాడు. లక్షరూపాయలు అందించాడు. జేబులో పిస్తోలు తీసి ఇచ్చాడు. వాడు దాన్ని తనబ్యాగ్‌లో వేసుకుని వెళ్లి పోయాడు. ఆడబ్బును తల్లి పెట్టెలో దాచాడు. నువ్వు చేస్తుంది ఏమిటి అనికూడా తల్లితండ్రులు అడగలేదు. కదలాడే శవాల్లా అయిపోయారు. చేతికి అందివచ్చిన కొడుకు పూర్తిగా నేరగాడు అయి పోయాడని విలవిలలాడిపోసాగారు.

రాజులు ఆసాయంత్రం వరకు తిన్నాను పడుకున్నాను అన్నట్టుగానే ప్రవర్తించాడు. చీకటిపడుతుండగా లేచి పనికి వచ్చేసామాన్లు సర్దాడు. తల్లికి ఏమి అర్థంకాలేదు. ఆమెచీరలు పెట్టెలో సర్దుతుంటే అడిగింది. "ఎక్కడికిరా మమ్మల్ని తీసుకుపోవాలనుకుంటున్నావు?"

"అమ్మా నన్నుపెద్దకాపు, వాడికొడుకు గూండాగా మార్చే ప్రయత్నంలో ఉన్నారు. త్వరలో నాతో హత్యలు చేయించడానికి కూడా వారు వెనుకాడరు. మనం ఈఊరు వదిలిపోదాం. ఎక్కడైనా మీరు కోరినవిధంగా నీతిగా బ్రతుకుతాను. అదే ఇక్కడుంటే భయంకరమైన గూండాగా తయారు చేస్తారు. అందుకే వారిచ్చిన పిస్తోలును నాకు జైలులో పరిచయం అయిన ఒక నేరగాడికి ధర తగ్గించి అమ్మేశాను. ఈడబ్బుతో మనం ఇక్కడికి వెయ్యికిలోమీటర్ల దూరంపోయి బ్రతుకుదాం."

ఒక్కసారి తల్లితండ్రుల ముఖాల్లో వేయిబల్బుల వెలుగు కన్పించింది. "నాయనా నువ్వు చెబుతుంది నిజమా?"తల్లి నమ్మలేనట్టుగా అడిగింది.

"చూశావా అమ్మా నన్ను నేరగాడిగా చూసినందున నీవు నమ్మలేక పోతున్నావు. వద్దమ్మా అలాంటి జీవితం నాకు వద్దు. అందుకే ఈఊరి నుంచి పారిపోదాం. అందుకు ఏర్పాట్లుచేశాను" దృఢచిత్తంతో చెప్పాడు.

ఆసాయంత్రం సెల్ ఫోన్ ద్వారా ఒక కారును రప్పించి తల్లితండ్రులతో సహా కూర్చున్నాడు. ఊరంతా చూస్తుండగా బయల్దేరాడు. కన్పించిన వారికి "మొక్కుచెల్లించుకోవడానికి కొండకు వెడుతున్నాం. నాలుగు రోజుల్లో వచ్చేస్తాం." చెప్పి పెద్దకాపును కలిశాడు.

"చూశావా నీదర్జా కారు రేంజికి ఎదిగింది. ఇంకా పైపైకి వెళ్లిపోతుంది. కొండకు వెడుతున్నావు. ఇది ఉంచు" అని చేతిలో ఒక నోట్లకట్ట పెట్టాడు పెద్దకాపు. కారు బయల్దేరింది. ఆముగ్గురు చివరి చూపు అన్నట్టు ఊరంతా చూసుకున్నారు. శ్రమజీవనాన్ని వెతుక్కుంటూ ✻

థైరాయిడ్ సమస్యలు నివారణా మార్గాలు

డాక్టర్ కె. శ్రీకాంత్,
ఎండోక్రినాలజిస్ట్,
శ్రీకాంత్ ఎండోక్రినాలజి క్లినిక్,
గుంటూరు.



థైరాయిడ్ మెడ కింద, కంఠమణి కింద ఉండే ఒక గ్రంథి. ఇది సీతాకోకచిలుక చెరి ఒక రెక్క రూపంలో లేదా ఖండం ఆకారంలో శ్వాసనాళానికి ఇరుపక్కలా ఉంటుంది. థైరాయిడ్ హార్మోన్లను ఉత్పత్తి చేయడం, నిలువ చేయడం, రక్తంలోకి విడుదల చేయడం థైరాయిడ్ పని. థైరాయిడ్ హార్మోన్ శరీరంలోని ప్రతి కణంపై ప్రభావం చూపి, శరీరంలో పనులను నియంత్రించేందుకు సాయపడుతుంది. థైరాయిడ్ హార్మోన్ రక్తంలో బాగా తక్కువగా ఉన్నట్లయితే, శరీరం పనితీరు తగ్గుతుంది. ఈ పరిస్థితిని హైపోథైరాయిడిజమ్ అంటారు. రక్తంలో మరీ ఎక్కువగా థైరాయిడ్ హార్మోన్ ఉంటే, శరీరం వేగంగా పనిచేస్తుంది. ఈ పరిస్థితిని హైపర్ థైరాయిడిజమ్ అని అంటారు. థైరాయిడ్ గ్రంథి ఉత్పత్తి చేసే థైరాయిడ్ హార్మోన్ మొత్తం పిట్యుటరీ అనబడే మరో గ్రంథి చేత, హైపోథాలమస్ అనబడే మెదడులోని భాగం చేత నియంత్రించబడుతుంది. పిట్యుటరీ గ్రంథి మీ శరీరంలోని అనేక ఇతర గ్రంథులను నియంత్రించే హార్మోన్లను తయారు చేస్తుంది.

హైపర్ థైరాయిడిజమ్

థైరాయిడ్ గ్రంథి మరీ ఎక్కువ థైరాయిడ్ హార్మోన్ (T3, T4) ని ఉత్పత్తి చేస్తే హైపర్ థైరాయిడ్ వ్యాధికి గురికావచ్చు. ఒకవేళ హైపర్ థైరాయిడ్ వస్తే పిట్యుటరీ గ్రంథి టిఎస్‌హెచ్ హార్మోన్‌ను తక్కువగా ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల మీ రక్తంలో థైరాయిడ్ హార్మోన్లు ఎక్కువగా ఉండి టిఎస్‌హెచ్ అతి తక్కువగా ఉంటుంది. థైరాయిడ్ హార్మోన్లు ఎక్కువగా ఉండటం వలన శరీరం వేగంగా పనిచేస్తుంది. ఈ కారణంగా నరాల బలహీనత, గుండె త్వరితంగా కొట్టుకోవడం (నిమిషానికి 100సార్లుకన్నా ఎక్కువ), నీరసంగా ఉండటం, బరువు తగ్గడం, ఎక్కువగా ఆకలి ఉండటం, చేతులు, కాళ్లు వణకడం, థైరాయిడ్ గ్రంథి వాపు, ఎముకల బలహీనత, ఆదుర్దా లేదా చిరాకు, దెబ్బలాడాలనే అనుభూతి, చెమటలు పట్టడం, మామూలుకన్నా ఎక్కువగా తింటున్నా బరువు కోల్పోవడం, వేడి ఉష్ణోగ్రత పాలిట అసహనం మరియు చెమటలు కారడం ఎక్కువయ్యే అవకాశం, జుట్టు ఊడిపోవడం, కండరాలలో, ముఖ్యంగా పై చేతులలో, తొడలలో బలహీనత, ఎక్కువ సార్లు మల విసర్జన, నెలసరి ఇబ్బందులు వంటి సమస్యలు వస్తాయి.

వ్యక్తిగత, కుటుంబ చరిత్ర : థైరాయిడ్ అనారోగ్యాలు తరచుగా వంశపారంపర్యంగా రావచ్చు. ఒకవేళ మీ కుటుంబ సభ్యులలో, మీ అమ్మకు లేదా నాన్నకు లేదా అత్తకు లేదా మామకు లేదా మీ అన్నదమ్ములకు అక్క చెల్లెళ్లకు గానీ ఒక థైరాయిడ్ సమస్య ఉన్నట్లయితే మీలో థైరాయిడ్ సమస్య వచ్చే అవకాశం ఎక్కువ.

హైపర్‌థైరాయిడిజమ్‌కు చికిత్స చేయడం

హైపర్‌థైరాయిడిజమ్‌కి చికిత్స చేసేందుకు అనేక పద్ధతులున్నాయి. యాంటీ థైరాయిడ్ మందులు, రేడియో యాక్టివ్ అయోడీన్, శస్త్ర చికిత్స. మీరు దేనిని ఎంచుకోవాలో ఎండోక్రైనాలజిస్ట్‌ను కలిసి ఆయన సూచన మేరకు చికిత్స చేయించుకోవాలి.

యాంటీథైరాయిడ్ మందులు

మీరు మాత్రల రూపంలో తీసుకోగల మందులు ఉన్నాయి. అవి మీ థైరాయిడ్ యొక్క థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తిని నియంత్రిస్తాయి. అయినప్పటికీ తరచుగా ఒకసారి మందులు మానివేస్తే మీ హైపర్ థైరాయిడిజమ్ తిరిగిరావచ్చు. ఇంకా మీకు చికిత్స అవసరమవుతుంది.

రేడియోయాక్టివ్ అయోడిన్

రేడియోయాక్టివ్ అయోడిన్ హైపర్‌థైరాయిడిజమ్‌కి సురక్షితమైన, అమోదయోగ్యమైన చికిత్స. ఈ పదార్థం మీ థైరాయిడ్ గ్రంథిలోకి ప్రవేశించి, థైరాయిడ్ కణాలను శాశ్వతంగా నశింపచేస్తాయి. ఈ కారణంగా థైరాయిడ్ గ్రంథి థైరాయిడ్ హార్మోన్‌ను ఉత్పత్తి చేయలేదు. ఈ చికిత్స పద్ధతిని అనుసరిస్తే హైపోథైరాయిడ్‌గా మారి జీవితాంతం థైరాయిడ్ హార్మోనును తీసుకోవాల్సి ఉంటుంది. ఈ పద్ధతి వల్ల ఆపరేషన్ లేకుండానే వ్యాధిని శాశ్వతంగా నియంత్రించవచ్చు. రేడియో అయోడిన్ ఇవ్వలేని వారికి, అతిపెద్ద థైరాయిడ్ గ్రంథి (గాయిటర్) ఉన్నవారికి థైరాయిడ్ ఆపరేషన్ అవసరం రావచ్చు.

హైపోథైరాయిడిజమ్ అంటే

థైరాయిడ్ గ్రంథి మామూలుకన్నా తక్కువగా థైరాయిడ్ హార్మోన్లను ఉత్పత్తి చేస్తే హైపోథైరాయిడిజమ్ వస్తుంది. దీని ఫలితంగా శరీరంలో అనేక జీవ క్రియల వేగం మందగిస్తుంది. సాధారణంగా హైపోథైరాయిడిజమ్ శాశ్వతంగా ఉండే సమస్య. ఈ సమస్య స్త్రీలలో 10% వరకు, పురుషులలో 3% వరకు ఉంటుందని కొన్ని అధ్యయనాలు నిరూపించాయి. వ్యాధి

ప్రారంభంలో లక్షణాలు స్వల్పంగా ఉండి, కనిపెట్టలేము. అయినప్పటికీ కాలక్రమేణా లక్షణాలు మరింత తీవ్రమై అసౌకర్యాన్ని కలిగించి చివరకు ఆశక్తతకు గురిచేస్తుంది.

లక్షణాలు

అలసట, నీరసం, నిద్రమత్తు, మరచిపోవడం, నేర్చుకోవడంలో ఇబ్బంది, పెళుసైన పొడి జుట్టు, గోళ్లు, దురద పుట్టించే పొడి చర్మం, ఉబ్బిన ముఖం, మలబద్ధకం, కండరాల నొప్పి, శరీరం బరువెక్కడం, అధికంగా రుతుస్రావం, తరచూ గర్భస్రావాలు, కాళ్లకు నీరు రావడం.

నిర్ధారణ

వ్యాధిగ్రస్తులలో గుర్తించగల ప్రత్యేక లక్షణాలు, శారీరక చిహ్నాలు హైపోథైరాయిడిజమ్‌కి సూచనలు కావచ్చు. అదనంగా రోగ నిర్ధారణ హైపోథైరాయిడిజమ్‌కి సూచనలు కావచ్చు. అదనంగా రోగ నిర్ధారణ చేసుకునేందుకు, హైపోథైరాయిడిజమ్‌కి కారణాన్ని నిర్ణయించేందుకు పరీక్షలను ఉపయోగించవచ్చు.

టిఎస్‌హెచ్ (థైరాయిడ్ - స్టిములేటింగ్ హార్మోన్ లేదా థైరోట్రోపిన్) రక్తంలో పెరిగిన టిఎస్‌హెచ్ స్థాయి, హైపోథైరాయిడిజమ్ యొక్క ఖచ్చితమైన సూచకం. థైరాయిడ్ గ్రంథి, థైరాయిడ్ హార్మోన్‌ని ఉత్పత్తి చేయడం కొద్దిగా తగ్గినప్పటికీ పిట్యుటరీ హార్మోన్ ఉత్పత్తి ఎక్కువ అవుతుంది.

ఇతర పరీక్షలు

T4 (థైరోక్సిన్) మరియు T3 (ట్రై అయోడో థైరోనైన్) రక్తంలోని చురుకైన థైరాయిడ్ హార్మోన్లు. థైరాయిడ్ ఆటో యాంటీ బాడీస్ - హైపోథైరాయిడిజమ్ కారణమైన ఆటోఇమ్యూన్ థైరాయిడిటిస్ సంభావ్యతను సూచిస్తాయి.

హైపో థైరాయిడిజమ్ రోగ నిర్ధారణ

థైరాయిడ్ అనారోగ్యాలు తరచుగా వంశపారంపర్యమైనవి. వ్యక్తిగత, కుటుంబ చరిత్ర ఈ అనారోగ్యానికి దారితీస్తుంది. కొందరిలో ఇతరులకన్నా హైపోథైరాయిడిజమ్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. స్త్రీలు ముఖ్యంగా హై థైరాయిడ్ ... 40ఏళ్లు పైబడినవారు, ప్రసవానంతరం (ప్రసవం అయిన తర్వాత 6నెలలులోగా) వంధ్యత్వంకలగడం, అధిక కొలెస్ట్రాల్ తదితర కారణాలను బట్టి నిర్ధారించవచ్చు.

(మరిన్ని వివరాలు పై వారం)











నాకూ స్వంత భావాలున్నాయి



శృతి కమల్‌హాసన్... పద్మశ్రీ కమల్‌హాసన్, సారికల తనయ. 'లక్' అనే బాలీవుడ్ చిత్రం ద్వారా వెండి తెరకు కథానాయికగా పరిచయమవుతోంది. ఇమ్రాన్ ఖాన్ సరసన కథానాయికగా నటిస్తోంది. ఆమె నటి కాకముందే గాయని, మ్యూజిక్ కంపోజర్ కూడా. తనకంటూ స్వంత భావాలున్నాయని శృతి చెబుతున్న ముచ్చట్లు...

పాడడం ఎప్పుడు స్టార్ట్ చేశారు?

స్కూల్లో చదువుకునే రోజుల్లోనే స్టేజ్ మీద పాడడం మొదలుపెట్టాను. పెద్దయిన తర్వాత గాయని, డాన్సర్, నటి అవ్వాలన్న ఉద్దేశం ఆ వయసులో కలుగలేదు.

పేరెంట్స్‌తోపాటు సెట్స్‌కి తరుచుగా వెళ్ళేవారా?

తరచుగా వెళ్లేదాన్ని కాదు. చిన్నప్పుడు సెట్స్‌కి వెళ్ళినప్పుడు జనరేటర్ సౌండ్స్, మేకప్ వాసనలు, లొకేషన్స్ ఇంకా జ్ఞాపకాల్లోనే ఉన్నాయి. 'విచిత్ర సహోదరులు' లొకేషన్ ఇంకా గుర్తుంది. డాడీ ఒక క్యారెక్టర్ తర్వాత మరొకటి వేసేవారు. ఆ పాత్రల వైవిధ్యం గురించి ఆ వయసులో అంతగా తెలిసేది కాదు. పెద్దయిన తర్వాత డాడీ నటనను ఆసక్తిగా గమనించేదాన్ని.

ఆయన సినిమాల్లో ఏ చిత్రంలో నటనంటే ఇష్టం?

'మహానది'లో నటనంటే బాగా ఇష్టం. అలాగే గుణ, నాయకుడు...

అగ్ర కథానాయకుడి కూతురుగా ఇండస్ట్రీలోకి ప్రవేశించడం సులువైందని భావిస్తారా?

అవును. మిగతా నటుల్లా ఇబ్బంది పడకుండా డైరెక్ట్‌గా వచ్చాను. ఇక్కడ ఒక్కసారి సక్సెస్ సాధిస్తే... మన పుట్టుపూర్వోత్తరాలతో పని లేదు. అవసరమూ ఉండదు. ఫిలిం ఇండస్ట్రీతో సంబంధం లేనివాళ్ళు సక్సెస్ సాధిస్తారు. అలాగే సంబంధమున్నవాళ్ళు విజయం సాధించాలన్న రూల్లేదు. కాకపోతే ఈ ఫ్యామిలీలో పుట్టినందుకు గర్వంగా ఉంది.

కమల్ కూతురుగా ప్రేక్షకుల్లో మీ మీద అంచనాలు ఎక్కువున్నాయి కదా!

అవును. నాన్నగారి దారిలో వెళ్తున్న సమయంలో... ప్రేక్షకుల, అభిమానుల గుండె చప్పుడు అర్థం చేసుకోగలను. కానీ నాకంటూ స్వంత భావాలున్నాయి. ఇంకొకరి అభిప్రాయాలు, అభిరుచులతో ఏకీభవించలేను.

అమెరికాలో ఏం చదివారు?

సంగీతానికి సంబంధిన కోర్సులు చేయడానికి వెళ్ళాను. ప్రామాణికమైన విద్యతో పాటు నేనేమిటో తెలుసుకున్నాను.

మీ గురించి ఏం తెలుసుకున్నారు?

ఇంటికి దూరంగా ఉండేవాళ్ళ గురించి తెలుసుకున్నాను. స్వేచ్ఛగా పెరగడంలో నాకెలాంటి ప్రాబ్లమ్ లేదు. అలాగే బాధ్యతలు తెలుసుకుని పెరిగాను.

ఒంటరిగా పెరగడం జీవితాన్ని ఎలా మారుస్తుందంటారు?

19 ఏళ్ళ వయసులో అమెరికా వెళ్ళాను. ఒక దారిలో మనం బతకాలనుకున్నప్పుడు అదే దారిలో వెళ్ళాలి. ఎదుటివారిని బాధ పెట్టే మనస్తత్వం గలవారిని దూరంగా ఉంచేదాన్ని.

చదువుకునే రోజులు ఎలా గడిచాయి?

కమల్‌హాసన్ అమ్మాయి కావడంతో... ఆ రోజులు ఓ మంచి అనుభూతి మిగిల్చాయి. స్కూల్ డేస్ చెన్నయ్‌లో గడిచాయి. కాలేజీ చదువు ముంబయిలో గడిచిపోయింది.

ముంబయిలో చదివేటప్పుడు మీరెవరో తెలుసా?

నాన్నగారు దేశం మొత్తం తెలియడంతో నేనెవరో తెలియకుండా జాగ్రత్తపడే అవకాశం లేకపోయింది. ముంబయిలో నాన్నగారిని బాగా అభిమానించేవారు. అమెరికాలో చదివేటప్పుడు నేనెవరో వారికి తెలీదు.

ఆ ఎక్స్‌పీరియన్స్...

ఆ ఎక్స్‌పీరియన్స్‌ను బాగా ఆస్వాదించా. మొదటిసారి నేనెవరో తెలీని ప్రదేశానికి వెళ్ళాను. నాలో లక్షణాలు మెచ్చుకున్నారు, విమర్శించారు. నా సొంత వ్యక్తిత్వం ఏర్పరచుకోవడానికి ఆ వాతావరణం తోడ్పడింది

*

కస్తా ఖైమా

కావలసిన పదార్థాలు

ఖైమా - కిలో, మైదా - అర కిలో, నెయ్యి - వంద గ్రాములు

గుడ్లు - 2, అల్లం - 30 గ్రాములు, వెల్లుల్లి - 30 గ్రాములు

ఉప్పు - సరిపడా, మిరియాలు - 10 గ్రాములు

పుదీనా - 2 కట్టలు, బాదం పప్పులు - 50 గ్రాములు

జాపత్రి పొడి - 5 గ్రాములు, యాలకులు - 10 గ్రాములు

జీలకర్ర - ఒక స్పూను, పచ్చిమిర్చి - 5

ఖైమాను మెత్తగా కొట్టించి బాగా కడిగి పాత్రలో వేయాలి. యాలకులు, పుదీనా, పచ్చిమిర్చి బాగా నూరి ఖైమాలో కలపాలి. దానిలోనే అల్లం, వెల్లుల్లి, జాపత్రి పొడి, జీలకర్ర, 1కోడిగుడ్డు మిశ్రమం, నెయ్యి, కొంచెం ఉప్పు కలిపి ఎసరు పోసి గ్రేవీ ఉండేలా చేయాలి. మిగిలిన గుడ్డును ఉడకబెట్టి ముక్కలు ముక్కలుగా చేసి పెట్టుకోవాలి. మైదా పిండిని చపాతీల్లా పల్చగా వత్తుకోవాలి. అట్లపెనంపై నెయ్యి పూసి వత్తుకున్న చపాతీని వేసి దానిపై ఖైమా ముద్దలో కొంత పెట్టాలి. మరలా ఆ ఖైమా మీద మరో చపాతీ పెట్టి దానిమీద ఖైమా మిశ్రమాన్ని పెట్టి చివరిగా ఇంకో చపాతీని కప్పాలి. దీనిమీద ఇడ్లీ పాత్ర మూతను పెట్టి సన్న మంటమీద గంటసేపు ఉడికిస్తే సరి. దింపే ముందు...దానిమీద కొత్తిమీర చల్లి వడ్డించాలి.

లెమన్ పూరి

కావలసినవి

నిమ్మకాయలు - 2

మైదాపిండి - ఒక కప్పు

పంచదార - ఒక కప్పు

నెయ్యి - ఒక కప్పు

ఉప్పు - చిటికెడు

మిటాయిరంగు - కొంచెం

పాలు - ఒక స్పూను

మైదా పిండిలో నీళ్లు, ఉప్పు కలిపి ముద్దగా చేసుకోవాలి. చిన్న చిన్న ఉండలు చేసి అప్పడాల కర్రతో పూరీల్లాగా వత్తాలి. దీనినే చెగోడీల్లా కూడా చేసుకోవచ్చు. మరో పాత్రలో పంచదార, నీళ్లూ కలిపి తీగ పాకం పట్టాలి. దానిలో పాలల్లో కలిపిన మిఠాయి రంగు కలపాలి. దీనిని వెడల్పాటి గిన్నెలోకి తీసుకోవాలి. నిమ్మకాయల రసం తీసి ఈ పాకంలో కలపాలి. లెమన్ ఎసెన్స్ కూడా వేసుకుంటే మంచి వాసన వస్తుంది. బూరెల మూకుడులో నెయ్యి వేసి బాగా కాగిన తర్వాత వత్తుకున్న పూరీలను వేసి గోధుమరంగు వచ్చేవరకు వేయించాలి. బాగా వేగిన తర్వాత వాటిని పాకంలో వేయాలి. వీటిని వేడివేడిగా తింటే చాలా రుచిగా ఉంటాయి.



బీరకాయ చెక్కు పచ్చడి

కావలసినవి

బీరకాయ చెక్కు - బీరకాయ కోసినపుడు మొదలు, చివర్లు కాకుండా మధ్యలో ఉండే గణుపుల దగ్గర తీసే చెక్కులు, పీచులు లేకుండా నీళ్లలో కడిగి ఉంచుకోవాలి.

ఎండు మిర్చి - 10,వెల్లుల్లి - 2 రెబ్బలు

చింతపండు - అర నిమ్మకాయంత

పసుపు - చిటికెడు, నూనె - 50 గ్రాములు

తాలింపు గింజలు - పావు చెంచా

జీర - పావు చెంచా, ఉప్పు - సరిపడా

ముందుగా ఎండు మిరపకాయలు నూనెలో ఎర్రగా వేయించుకోవాలి. అందులోనే చిన్న ముక్కలుగా తుంచుకున్న బీరకాయ చెక్కువేసి కొంచెం వేయించుకోవాలి. మిక్సీలో వేయించిన ఎండు మిరపకాయలు, బీరచెక్కు, జీర , వెల్లుల్లి, ఉప్పు, చింతపండు, పసుపు వేసి మెత్తగా పచ్చడిలా నూరుకోవాలి. ఎండుమిర్చి, బీరకాయ చెక్కు వేయించగా మిగిలిన నూనెలో తాలింపు గింజలు వేసి పోపు పెట్టుకుంటే చాలు. అయితే దీనిలో కరివేపాకు వేయకూడదు. ఈ పచ్చడి అన్నంలోనే కాక ఇడ్లీ, దోసెల్లోకి కూడా చాలా బావుంటుంది.

క్యాబేజీ మంచూరియా

కావలసినవి

క్యాబేజీ తరుగు - 2 కప్పులు

కార్న్ ఫ్లోర్ - అరకప్పు

ఉప్పు - తగినంత

అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీ స్పూన్

పచ్చిమిర్చి తరుగు -2 టీ స్పూన్లు

చల్లని పాలు - పిండి కలపటానికి తగినన్ని

మసాలాకు : ఉల్లి తరుగు - 1 కప్పు, పచ్చిమిర్చి తరుగు - 2 టీ స్పూన్లు, సోయా సాస్ - 1 టీ స్పూను, టమాటా సాస్- పావు కప్పు, ఉప్పు - తగినంత, నూనె- 4 టీ స్పూన్లు.

క్యాబేజీ తరుగు, కార్న్‌ఫ్లోర్, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి, చల్లని పాలు తగినన్ని పోసి పిండిని కలపాలి. కాగిన నూనెలో వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించి తీయాలి. బాండీలో కొంచెం నూనెవేసి వేడిచేసి ఉల్లి తరుగు, పచ్చిమిర్చి చీలికలు,

ఉప్పు, సోయాసాస్, టమాటా సాస్ వేసి వేయించిన తర్వాత అందులోనే క్యాబేజీ బాల్స్‌ను వేసి కలపాలి.



దారి వెతుకుదాం

ఈ సాలె పురుగుకు బాగా ఆకలిగా ఉంది. గోడ గడియారం లోపలేమో మాంచి పురుగు కనిపించింది. అయినప్పటికీ దారి తెలియటంలేదు. కొంచెం దారి వెతికి పెడదామా

చుక్కలు కలిపేస్తే పోలా



టి. అపర్ణ, 7వ తరగతి,
జి.బి.ఎస్ స్కూల్,
మందస.





ఎమ్. అవినాష్,
10వ తరగతి,
ఎస్. ఎస్.యు.పి స్కూల్,
శ్రీకాకుళం.

పేపర్ పప్పీ కావాలా!



పిల్లలూ మీకు కుక్కబొమ్మ పేపర్‌తో చేయడమెలాగో తెలుసా? ఏంటీ చాలా కష్టం అనుకుంటున్నారా! ఏమీ కాదు చాలా తేలిక. మీరు 10 నిమిషాల్లో ఈ బొమ్మను చేయగలరు . ఇక్కడున్న బొమ్మలను చూసి చేయటం మొదలు పెట్టండి. ఇట్టే చేసేస్తారు. దీనికి కావలసిందల్లా ఒక్క పేపర్ మాత్రమే. మరి మొదలెడ్తున్నారా.

నాలుగు వైపులా సమానంగా ఉన్న మందపాటి పేపర్ ముక్కను తీసుకోవాలి. దానిని సగానికి మడత పెట్టాలి. తిరిగి దానిని మధ్యలోకి మడిచి తీయాలి. నాలుగవ బొమ్మలో చూపించినట్లుగా రెండు చివరలు మధ్యలోకి మడవాలి. ఇవి రెండు చెవులన్నమాట. తరువాత ఐదవ బొమ్మలో చూపించినట్లుగా చెవుల పై భాగాన కొద్దిగా వెనుకకు, క్రింది వైపున కూడా కొద్దిగా వెనుకకు తిప్పాలి. ఇప్పుడు ముందువైపు మధ్య భాగంలో రెండు కళ్లు, ముక్కు, నోరు పెట్టుకుంటే సరిపోతుంది. మీ కుక్క బొమ్మ రెడీ.

1


2



5


4


3



నేను ఎవరిని?

హలో బుజ్జాయిలూ... ఈ బొమ్మను చూశారుగా. ఏంటీ ఇది బొమ్మా అంటున్నారా?కొంచెం ఆగండి మరి. ఈ బాక్సులో కొన్ని చోట్ల ప్లస్ గుర్తులు, మరి కొన్ని చోట్ల త్రికోణం గుర్తులు ఉన్నాయి. చూశారుగా. ఒకదానిలో నలుపు, మరొక గుర్తులో కాఫీ పొడి రంగులు వేసి చూడండి.

జంతువులున్నాయా...

అడవిలో ఒక కొండచిలువ, ఒక ఏనుగు కనిపిస్తున్నాయికదూ. కానీ అక్కడే ఇంకా 5 జంతువులు కూడా ఉన్నాయి. బాగా పరిశీలించి చూడండి.



జవాబు: కుడి వైపు చెట్లలో పైన పులి, ఎడమవైపు కింద సింహం, కుడివైపు కింద 2 మొసళ్లు, కుడి వైపు ఏనుగు, పక్క చెట్లలో నక్క. కనిపించాయా.

అట్టమీది కథ

వైట్‌హౌస్‌లో ఒబామా

ఎమ్. కోటేశ్వరరావు

అభివృద్ధిలో అమెరికా ప్రపంచ అగ్రస్థానంలో ఉంది. అంతరిక్ష ఉపగ్రహాలద్వారా పడకగదుల్లోకి సైతం తొంగి చూడగల సామర్థ్యం సంపాదించింది కానీ దొంగోట్లు వేయకుండా నిరోధించే ఎన్నికల విధానాన్ని రూపొందించటంలో మాత్రం ఘోరంగా విఫలమైంది. నిజానికి విఫలమైంది అనటం కంటే గత ఎన్నికలలో జరిగిన అక్రమాలను బట్టి కావాలనే అవసరమైతే అడ్డగోలుగా విజయం సాధించటానికి అనువైన లోపాలతో దానిని నిర్వహిస్తున్నారని చెప్పాల్సి ఉంటుంది. ఆఫ్రికాలోని అత్యంత వెనుకబడిన, ప్రజాస్వామ్యవాసనలు లేని దేశాల మాదిరి ఓటర్ల జాబితాలను తారుమారు చేయటం, ఒకరి ఓటును మరొకరికి బదలాయించటం వంటి అక్రమాలన్నీ అక్కడ ఎంతో సులభం. ఎన్నికల రోజు వరకు ఓటర్ల జాబితాలో తమ పేరుందో లేదో పౌరులకు తెలియదంటే అతిశయోక్తి కాదు.

అంతా అధికారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటుంది. ఒక రాష్ట్రంలో ఉన్న నిబంధనలు మరో రాష్ట్రంలో ఉండవు. అలాంటి అమెరికాలో ఈనెల నాలుగున అధ్యక్ష ఎన్నికలకు రంగం సిద్ధమైంది. పదమూడు కోట్ల మంది ఓటింగ్ హక్కును వినియోగించుకోవచ్చని భావిస్తున్నారు. పదిహేడు కోట్ల మంది నమోదుచేయించుకున్న ఓటర్లు మరో ఐదుకోట్ల మంది నమోదు కాని ఓటర్లు ఉన్నారు. అక్కడి నిబంధనల ప్రకారం ఎన్నికల తేదీకి ముందుగానే సైనికులు ఓటు వేయవచ్చు. దానిని పౌరులు కూడా వినియోగించుకుంటున్నారు. ఆ కారణంగానే గతనెల చివరివారంలోనే ప్రస్తుత అధ్యక్షుడు బుష్, అనేక మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ప్రపంచంలో తమదే అత్యంత ప్రజాస్వామిక దేశమని చెప్పుకొంటుంది అమెరికా. ఆచరణలో ప్రజాస్వామ్యం పీక నులమటానికి అది ప్రయత్నించని రోజులేదు. అనేక దేశాల్లో ఎన్నికలు సక్రమంగా జరగటం లేదని సుద్దులు చెప్పే అమెరికాకు తన కింది నలుపు కనపడదు. అక్కడి గాడిద పార్టీ(రిపబ్లికన్లు), ఏనుగు పార్టీ(డెమాక్రాట్లు) రెండూ ఒకటి ఇసుక తక్కెడ అయితే మరొకటి పేడ తక్కెడ వంటిది. ఎవరిని ఎన్నుకోవాలన్న ప్రశ్న ఉదయించినపుడు అమెరికన్లకు ఉన్నది ఒక అవకాశమే. అది ఏనుగు లేదా గాడిద దేన్నో ఒకదాన్ని ఎన్నుకోవాలి తప్ప మూడవ ప్రత్యామ్నాయం లేదు. ఆ రెండూ పిల్ల దెయ్యం, పెద్ద దెయ్యం లాంటివి. అందువలన దేన్ని ఎంచుకోవాలి అన్న పరీక్ష వచ్చినపుడు సహజంగానే అక్కడి అభ్యుదయ వాదులు, కమ్యూనిస్టులు కూడా పిల్లదయ్యాన్నే ఎంచుకొనేందుకు మొగ్గుచూపుతారు. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. ఇప్పుడున్న వాతావరణాన్ని బట్టి ఎన్నికల్లో అక్రమాలు జరిగితే తప్ప డెమాక్రటిక్ పార్టీ అభ్యర్థి బరాక్ ఒబామా గెలవటం ఖాయం. రిపబ్లికన్ పార్టీ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా పనిచేసిన కోలిన్ పావెల్ వంటి ప్రముఖులతో పాటు అనేక మంది అధికారపక్ష నాయకులు చివరి క్షణాలలో ప్లేటు ఫిరాయించి ఒబామాకు మద్దతు ప్రకటించారు. అక్కడి ప్రధాన పత్రికలు కూడా రెండుపక్షాలుగా చీలి తమ మద్దతును ప్రకటించటం ప్రతి ఎన్నికల మాదిరి ఈ సారి కూడా జరిగింది. చివరిగా న్యూయార్క్ టైమ్స్ పత్రిక మద్దతు ప్రకటించటంతో ఎన్నికల త్రాసు ఒబామా వైపే మొగ్గనుందని చెప్పవచ్చు. అంతేకాక అనేక మంది వేస్తున్న అంచనా ప్రకారం 1992లో బిల్‌క్లింటన్ సాధించిన మెజారిటీని అధిగమిస్తారని చెబుతున్నారు.

ఒబామా ఓట్ల కొనుగోలుకు యత్నిస్తున్నాడా?

అమెరికా ఎన్నికల్లో పైసామే పరమాత్మహై అన్నది చెప్పనవసరం లేదు. గత ఎన్నికలల్లో 500 కోట్ల డాలర్లు ఖర్చయినట్లు అంచనా. ఇప్పుడు అది రెట్టింపు లేదా కనీసం 900 కోట్ల డాలర్లకు పెరగవచ్చని అంచనా. గెలుపు బాటలో ఉన్నాడన్న వాతావరణం ఉంది కనుక ఒబామాపై చేయని ఆరోపణ లేదు. వాటర్ గేట్ కుంభకోణం తరువాత అత్యధికంగా ఎన్నికల విరాళాలు సేకరించిన వ్యక్తిగా దాదాపు 60 కోట్ల డాలర్లు సంపాదించినట్లు ప్రత్యర్థులు

ఎలక్టొరల్ కాలేజి

అమెరికా ఓటర్లు అధ్యక్షుడికి నేరుగా ఓటు వేయరు. దేశం మొత్తం మీద 538 మంది అభ్యర్థులకు ఓట్లు వేస్తారు. వారు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకొంటారు. వారికి వచ్చిన ఓట్లను అధ్యక్షుడికి వేసినవిగా పరిగణిస్తారు.





అమ్మానాన్నా... చిన్నారి ఒబామా

పేర్కొంటున్నారు. జాతీయ, స్థానిక టీవీ ఛానళ్లకు ఇచ్చిన 30 సెకండ్ల నిడివి గల 50 వేల ప్రకటనలకు డబ్బు ఎక్కడిదని ప్రశ్నిస్తున్నారు. వాటిని ఏకంగా ఒక ఛానల్లో ప్రదర్శిస్తే 17 రోజులు పడుతుందట. ఎన్నికల యాడ్స్ ఛానళ్లకు ఎంత ముఖ్యమో తెలుసుకోవాలంటే అవి అమెరికన్లకు అత్యంత ప్రీతిపాత్రమైన బేస్‌బాల్ ఆటలను కూడా వెనక్కు జరుపుతున్నాయి. అర్ధగంట కార్యక్రమానికి పది నుంచి 20 మిలియన్ డాలర్లు వసూలు చేస్తున్న ఛానళ్లు ఉన్నాయి. మాజీ విదేశాంగ మంత్రి కోలిన్ పావెల్ ఎప్పుడైతే ఒబామాకు మద్దతు ప్రకటించాడో అప్పుడే మిలియన్ల డాలర్లు విరాళాలుగా వచ్చాయి. ఆఫ్రికన్-అమెరికన్ అయిన పావెల్ 1995లోనే అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేయాలని ప్రయత్నించాడు. రిపబ్లికన్ పార్టీ నాయకుడిగా ఉన్న పావెల్ కొన్ని విషయాల్లో బుష్‌తో విభేదించాడని చెబుతారు. ఇరాక్ యుద్ధంలో పూర్తి మద్దతు ఇచ్చాడు. అయితే ఎన్నికలకు రెండువారాల ముందు డెమొక్రాట్లకు మద్దతు ప్రకటించటం రిపబ్లికన్లను మరింతగా నీరుకార్చింది. ఒక్క సెప్టెంబరు నెలలోనే పదిహేను కోట్ల డాలర్ల నిధులు చేకూర్చటంలో ఆయన హస్తం ఉందని వెల్లడైంది. ఇలాంటి నిధులకు ఎక్కడా లెక్కా పత్రాలు ఉండవు.

సోషలిజాన్ని చూపి భయపెడతారా?

బుష్‌గారి పార్టీ ఔననే అనుకుంటోంది. అందుకే తన అభ్యర్థి మెకెయిన్ చేత ప్రత్యర్థి ఒబామాను సోషలిస్టుగా అభివర్ణింప చేయించింది." ఒబామా ఒక సోషలిస్టుగా ఉండేందుకు ప్రయత్నించటం నిజం. ఒబామా పన్నుల పథకం పూర్తిగా సంపదను పున:పంపిణీ చేయాలనటమే అంటే అది కేవలం సోషలిజం కాదు పూర్తి స్థాయి కమ్యూనిజం. తొంభైఐదుశాతం మంది అమెరికన్లకు పన్నులు తగ్గించుతామని చెప్పటం అందుకు పెద్ద ఉదాహరణ(నిజానికి అమెరికాలో పన్నులు చెల్లిస్తున్నది 40శాతం మంది మాత్రమే అని వార్తలు సూచించాయి). ఇది పూర్తిగా జనాకర్షక పథకమే. కేంద్ర ప్రభుత్వం చమురు పరిశ్రమను స్వాధీనం చేసుకోవాలని, బ్యాంకులను జాతీయం చేయాలని, వాణిజ్యంపై ఆంక్షలు పెట్టాలని డెమొక్రాట్లు ప్రతిపాదిస్తున్నారు. అంతేకాదు మన కంపెనీలను దేశం వెలుపల వ్యాపారం చేయకుండా అడ్డుకోనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది సోషలిజం కాదు, ఫాసిజం. ఒబామా సోషలిస్టుకంటే పెద్ద ఫాసిస్టు అని నేను చెప్పగలను" ఇదీ మెకెయిన్ ప్రచార తీరు. మెకెయిన్ కొన్ని సభల్లో ఒబామాను ఉగ్రవాదిగా చిత్రిస్తూ వాడ్ని చంపేయాలని ఊగిపోవటాన్ని అల్ జజీరా టీవీ చిత్రీకరించింది. దీనిపై ఒబామా సమాధానమిస్తూ " సోషలిజమా ? నేను సోషలిజాన్ని అమలు జరుపుతున్నట్లయితే వారెన్ బఫెట్, కాలిన్ పావెల్ నన్ను ఎలా బలపరిచారో చెప్పటం కష్టం. ఒకవేళ ఈ అమెరికన్లు తమతో తెగతెంపులు చేసుకోవటమే సోషలిజమని జాన్‌మెకెయిన్ అనుకుంటే ఇదొక మంచి అవకాశంగా భావిస్తాను" అన్నాడు.

ఒబామాను దెబ్బతీసేందుకు రిపబ్లికన్లు పలురకాలుగా ప్రయత్నించారు. 1. ఒబామా 30 ఏళ్ల క్రితం అమెరికాను ద్వేషించాలని ఆఫ్రో-అమెరికన్ పిల్లలకు నూరిపోశాడని, కొత్తగా పుట్టిన పిల్లలంటే ఒబామాకే ద్వేషమని ప్రచారం చేశారు. 2. తప్పుడు ఇమెయిళ్లద్వారా ఒబామా



ఒబామా కుటుంబం

గురించి తప్పుడు ప్రచారంద్వారా వ్యతిరేకతను రెచ్చగొట్టారు. అతను క్రైస్తవుడు కాదని, ముస్లిం అని చెవులు కొరికారు. 3. భారీ సంఖ్యలో ఓటర్లకు టెలిమార్కెటీర్ల ద్వారా ఫోన్ చేసి ఒబామా ఉగ్రవాది అయెర్స్‌తో కలిసి పనిచేశాడని ప్రయత్నించారు. నిజానికి అయెర్స్ ఉగ్రవాదిగా ఉన్నప్పుడు అసలు ఒబామా చిన్నపిల్లవాడిగా ఉన్నాడు. చాలా కాలం అమెరికాలోనే లేడు. అమెరికా చట్టాలలో ఇలాంటి ప్రచారం చేసే టెలిమార్కెటీర్లపై ఎలాంటి

ఆ తేదీనే ఎందుకు?

అమెరికా అధ్యక్ష ఎన్నికలలో పోలింగ్ తేదీకి ఒక ప్రాముఖ్యత ఉంది. ఆ తేదీనే విధిగా ఇప్పటివరకు ఎన్నికలు జరుగుతున్నాయి. అమెరికా పార్లమెంట్ 1792లో చేసిన ఒక చట్టం ప్రకారం అధ్యక్ష ఎన్నికలు లీపు సంవత్సరంలో డిసెంబరులో వచ్చే తొలి బుధవారంలోగా 34 రోజుల వ్యవధిలో పూర్తికావాలి. అంటే నవంబరులో పంటలన్నీ ఇంటికొస్తాయి గనుక అందరికీ వెసులుబాటు కలిగించేందుకు ఈ నిర్ణయం చేశారు. అయితే ఈ నిర్ణయం వలన తరువాత కాలంలో కొన్ని సమస్యలు వచ్చాయి. కొన్ని చోట్ల ముందుగా జరిగిన ఎన్నికల ఫలితాలు తరువాత జరిగే ప్రాంతాలపై ప్రభావం చూపాయి. విజయాలను తారుమారు చేశాయి. దాంతో ఒకే రోజు ఎన్నికలు జరపాలని 1845లో పార్లమెంట్ నిర్ణయించింది. దాని ప్రకారం నవంబరునెలలో వచ్చే తొలి సోమవారం తరువాత మంగళవారం ఎన్నికలు జరపాలని నిర్ణయించారు. అంటే నవంబరు రెండు నుంచి ఎనిమిదిలోపు ఎన్నికలు జరుగుతాయి.

మంగళవారమే ఎందుకు ?

బైబిల్ ప్రకారం దేవుడు ఆరు రోజుల పాటు సృష్టి కార్యం చేసి ఏడవ రోజున విశ్రాంతి తీసుకున్నాడు. యూదుల నమ్మకం ప్రకారం ఏడవ రోజు శనివారం. కానీ తరువాత క్రైస్తవులు దానిని ఆదివారం నాడు పాటించటం ప్రారంభించారు. అందువలన ఆదివారం దేవుడికి విశ్రాంతి కనుక తాము కూడా ఆ రోజునే విశ్రాంతికి ఎంచుకున్నారు. ఆదివారం వెంటనే వచ్చే సోమవారం అయితే దూరప్రాంతం నుంచి వచ్చే ఓటర్లకు ఇబ్బంది, బుధవారం సంతరోజు, కనుక మంగళవారం నాడు ఎన్నికలు జరపాలని నిర్ణయించారు. అయితే ఇప్పుడు మంగళవారం ఎన్నికలు జరపటాన్ని అనేక మంది విమర్శిస్తున్నారు. వారం మధ్యలో ఉంటుంది కనుక ఓటింగ్‌కు వచ్చే వారు తగ్గుతారన్నది ఒక వాదన. ఎన్నికల రోజును సెలవుగా అయినా పరిగణించాలి లేదా ఓటు వేసేందుకు రెండుమూడు రోజుల వ్యవధి ఇవ్వాలని కొన్ని సూచనలు వచ్చాయి. ఎన్నికల రోజు సెలవు ఇచ్చేందుకు అంగీకరించని అమెరికన్ పాలకవర్గాలు రెండో సూచనకే ఆమోదం తెలిపాయి. అయితే ఆటో కార్మికులు మాత్రం ఎన్నికల రోజును సెలవుగా సాధించుకున్నారు.

ఒబామాకు అర్హత లేదా?



చిన్నతనంలో ఒబాబా

అవునంటున్నాడు ఫిలిప్ జె బెర్గ్ అనే లాయర్. ఆమేరకు ఒక కేసును కూడా దాఖలు చేశాడు. ఒబామా అసలు అమెరికాలో పుట్టలేదని అందువలన అధ్యక్ష పదవికి అనర్హుడన్నది దాని సారాంశం. ఒబామా తల్లి అమెరికన్, తండ్రి కెన్యా జాతీయుడు. వారిద్దరూ అమెరికాలోని హవాయి విశ్వవిద్యాలయంలో చదువుకొంటూ వివాహం చేసుకున్నారు. ఒబామా పుట్టిన తరువాత విడాకులు తీసుకున్నారు. తరువాత ఒబామా తల్లి ఇండోనేసియా జాతీయుడిని వివాహం చేసుకుంది. ఆ తరువాత ఒబామాతో సహా అక్కడికి వెళ్లి పోయింది. అందువలన ఒబామా అమెరికన్ కాదన్నది ఆ లాయర్‌గారి వాదన. అయితే ఒబామా ఇండోనేసియా నుంచి వచ్చిన తరువాత 1997-2004 మధ్య ఇల్లినాయిస్ సెనెటర్‌గా ఉన్నాడు. ఆ తరువాత అమెరికన్ సెనెట్‌కు ఎన్నికయ్యాడు. అప్పుడులేని అభ్యంతరం ఇప్పుడెందుకన్న ప్రశ్న సహజంగా వస్తుంది. అయితే కోర్టు పక్షులకు వాటితో పనేముంది? ఈ పిటీషన్ కొట్టి వేయాలని ఒబామా గతనెల 20న పెన్సిల్వేనియా కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. కోర్టు నిర్ణయం వెల్లడి కావాల్సి ఉంది.



ఆంక్షలు లేవు. 4 ఓహియో, మరికొన్ని రాష్ట్రాలలో ఎఫ్‌బిఐ, మిలిటరీ అధికారులను చూపి కొత్త ఓటర్లను బెదిరించి రిపబ్లికన్లకు ఓటేయాలని చెప్పారు. తప్పుడు ఓటర్ల జాబితాను సమర్పించి దొంగోట్లకు ప్రయత్నించటం. అలాంటి రెండులక్షల ఓటర్ల జాబితాలో పేర్కొన్న వివరాలకు అప్పటికే వివిధ శాఖల్లో ఉన్న సమాచారానికి సరిపోలలేదని సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేయటం.

గత రెండు ఎన్నికల్లోనూ రిపబ్లికన్లు కొన్ని రాష్ట్రాలలో ఎన్నికల అక్రమాలకు పాల్పడిన కారణంగానే జూనియర్ బుష్ స్వల్ప మెజారితో విజయం సాధించాడు. ఈ ఎన్నికల్లో కూడా అలాంటి ప్రయత్నాలే జరుగుతున్నాయని గతవారంలో వార్తలు వచ్చాయి. ఒబామాకు మెజారిటీ ఓట్లు పడతాయని భావించిన చోట ఓటర్ల జాబితానుంచి పేర్లను తొలగించటం, ఓటింగ్ యంత్రాలలో ఒబామాకు వేసిన ఓటు మెకెయిన్ పేరుతో నమోదు అయ్యేట్లుగా సాఫ్ట్‌వేర్ రూపొందించటం, ఇలా ఎన్ని అవకాశాలుంటే అన్నింటికీ పాల్పడటంలో రిపబ్లికన్లకు పెట్టింది పేరు. గతెన్నికల్లో 30లక్షల ఓట్లను పలుసాకులతో లెక్కించలేదు. అందుకు ఎలాంటి కారణాలు చూపలేదు. అవి ఎక్కువగా డెమాక్రాట్లు మెజారిటీ ఉన్న జిల్లాలవే అని తరువాత తేలింది. ఈసారి కూడా ఇలాంటి అక్రమాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. పశ్చిమ వర్జీనియా ఓటర్లు తాము డెమాక్రాట్ల గుర్తుపై నొక్కితే ఓట్లు రిపబ్లికన్లకు పడుతున్నాయని ఫిర్యాదు చేశారు.

అమలు చేయని వాగ్దానాలు చేయటం మనదేశంలో మాత్రమే కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి వంటి పార్టీలు చేస్తాయని, పశ్చిమదేశాలలో అలాంటి తప్పుడు వాగ్దానాలు చేయరని చాలామంది చెబుతుంటారు. డెమాక్రటిక్‌పార్టీ అభ్యర్థి బరాక్ ఒబామా, రిపబ్లికన్ అభ్యర్థి జాన్ మెకెయిన్ అలాంటి వారి కళ్లు తెరిపిస్తున్నారు. ఒకరు ధనవంతుల మీద పన్ను తగ్గిస్తానంటే, మరొకరు ధనవంతుల మీద పన్ను పెంచి సాధారణ, మధ్యతరగతివారికి తగ్గిస్తానని ఎడాపెడా వాగ్దానాలు చేస్తున్నారు. అవి అమలు కావాలంటే అందుకు నిధులెక్కడివి, ఖజానాను ఎలా పూడుస్తారన్న ప్రశ్నలు అరణ్యరోదనగానే మిగిలిపోయాయి. ఇప్పటికే లోటుబడ్జెట్, నిండా అప్పుల్లో మునిగి ఉన్న స్థితిలో ఈ ఏడాది 455 బిలియన్లుగా ఉన్న లోటుబడ్జెట్ వచ్చే ఏడాదికి లక్షకోట్లకు చేరనుంది. ఈ స్థితిలో మెకెయిన్ చెప్పినట్లు పన్నురాయితీలు ఇస్తే ఆదాయానికి వచ్చేలోటు నాలుగేళ్లలో లక్షన్నరకోట్లు ఉంటుంది. అదే ఒబామా వాగ్దానం చేసినట్లు పెద్దలపై పన్ను విధించి పేదలకు తగ్గించి, ఆరోగ్యబీమాను విస్తరింపచేస్తే నాలుగు సంవత్సరాల్లో అయ్యే ఖర్చు పదిలక్షల కోట్ల డాలర్లు ఎలా సమకూర్చుతారో తెలియదు. ఇలాంటి విషయాల కంటే అమెరికన్లను గత ఎనిమిదేళ్ల రిపబ్లికన్ల పాలన, దేనికి దారితీస్తుందో తెలియని తీవ్ర ఆర్థిక మాంద్యం, ఇరాక్ యుద్ధం ప్రభావితం చేస్తున్నాయి. అవే బుష్ పార్టీని ఓడించనున్నాయి.

*

రామాయణంలో పిడకల వేట

సారా పాలిన్

రిపబ్లికన్ పార్టీ ఓటర్లను ఆకర్షించేందుకు 44 సంవత్సరాల మాజీ అందాల సుందరి, ప్రస్తుతం ఐదుగురు పిల్లల తల్లి సారా పాలిన్‌ను ఉపాధ్యక్ష అభ్యర్థిగా రంగంలోకి దించారు. పాలిన్ అమెరికా ఛాందసులకు ప్రతినిధిగా భావిస్తున్నారు. అయితే ఆమెపై ప్రత్యర్థులు అనేక రకాలుగా దాడి చేశారు. ఆమె 17 ఏళ్ల అవివాహిత కుమార్తెకు పుట్టిన బిడ్డకు తండ్రి ఎవరో తెలియకుండా దాచేందుకు ప్రయత్నించారన్నది ఒకటి. అసలు పాలినే ఆ బిడ్డను కన్నదని కూడా చెప్పారు. చివరకు తన బిడ్డ తల్లి అయిందని, త్వరలో వివాహం చేసుకోనున్నదని సారా ప్రకటించింది. అది ముగిసేలోగా ఆమే తన అందాన్ని కాపాడుకొనేందుకు చేస్తున్న విపరీత ఖర్చు గురించి పత్రికలు రాశాయి. సెప్టెంబరునెలలోనే ఆమె దుస్తులు, మేకప్, చెప్పులకు రిపబ్లికన్ పార్టీ లక్షా 50వేల డాలర్లు చెల్లించిందని వెల్లడైంది. జాన్ ఎడ్వర్డ్ అనే డెమాక్రటిక్ పార్టీ పెద్దమనిషి 400 డాలర్లు చెల్లించి క్రాఫ్ చేయించుకున్నందుకు తప్పుపట్టిన వారు ఇప్పుడు పాలిన్ గురించి ఏం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. పాలిన్ ఒక్కనెలలో తన తలవెంట్రుకల మేకప్‌కు 4,716 డాలర్లు ఖర్చు చేశారు. సారాకు అంత ఖరీదైన దుస్తుల అవసరం ఉందని, ఎన్నికల ప్రచారం తరువాత వాటిని పేదలకు దానం చేస్తామని అధ్యక్ష అభ్యర్థి మెకెయిన్ వివరణ ఇచ్చారు.

నాగరికత ముఖచిత్రం నగరం

హైమాస్ట్ లైట్ల వెలుగులో నగరపు రాత్రి
పున్నమి చంద్రుడ్ని వెక్కిరిస్తుంటుంది
బతుకు పోరాటంలో నెట్టివేయబడి
నోటిపై నవ్వును మెరిపిస్తూ
విటుడి వేటలో
తచ్చాడే ఆమె
హృదయం కోల్పోయిన నగరానికి ప్రతీకై నిలుస్తుంది
బ్రతుకు తెరువు చూపేది
బ్రతుకును భారం చేసేది నగరమే
ఆత్మవిశ్వాసం కల్గించి వెన్ను తట్టేది
ఆత్మన్యూనతతో గుండెల్ని మెలితిప్పేది నగరమే
చుట్టూ అల్లుకుంటున్న నగరీకరణలో
నిలబడే చోటులేక నిలువెల్లా భయంతో ఒకరు
ఆడంబరాలకు ఆకాశమే హద్దై అంతటా తానే అయి ఒకరు
తోటి మనిషితో నాలుగు మాటలకు
తీరిక లేకుండా
బతకడానికి నాలుగు డబ్బుల కోసం
నానా అగచాట్ల పాలవుతూ
ఆకాశమెత్తు అపార్ట్‌మెంట్ భవనాల్లో
గుండెల చుట్టూ కంచెల్ని పాతుకుంటూ నగరపు మనుషులు
అపరిమిత ఆనందానికే కాదు
అంతులేని నిరాశకూ నగరమే సాక్షి
నగరం ఒక నిర్మాణమే కాదు
నగరం ఒక విధ్వంసం కూడా
నగరం ఒక ఇంద్ర ధనస్సు
నగరం కలుషితమైన ఎడారి నీటి చెలమ
పల్లె పునాదులను పెకిలించివేసే
మర్రివృక్షం మహానగరం
నీడనిస్తున్నట్టు నటిస్తుంది
మరుగుజ్జు మనుషులను తయారుచేస్తుంది
నగరం నేటి మానవుడి
మనసు చిత్రం
నగరం నేటి మానవుడిని
అల్లకల్లోలం చేసే ఒక తుపాను
నగరం పంచరంగుల చిత్రపటం
నాగరికతకు ముఖచిత్రం నగరం

- వీరప్రసాద్

కవిత్వమ్

ఔను ! ఇది దేవుని రాజ్యమే!

ఔను! ఇది దేవుని రాజ్యమే !
సందేహమెందుకు ?
దేవుడి దృష్టిలో అందరూ సమానం కాదు !
డీ క్లాస్, డీ క్యాస్ట్ అయిన ఆదర్శవాదికి
కులం అంటగట్టే మను 'ధర్మ' మిది !
జానెడు జాగా కోసం పోరాడితే బేడీలేసి
అత్యాచారపు కేసులు పెట్టే ధృతరాష్ట్ర 'చట్ట' మిది !
కల్మషమెరుగని వాకపల్లి గిరిపుత్రికలను
వెంటాడి చెరపట్టిన అమానుష 'రక్షణ' ఇది !
బ్రతుకు వేటలో పరుగులెత్తి అలసిన
భాగ్యనగర జీవులను కాటేసిన ఫ్లై వోవర్ 'సోయగ' మిది !
వారాంతపు ఆహ్లాదం దిగ్భ్రాంతికర విషాదాంతమై
అమాయకుల ప్రాణం తీసిన ఉగ్రవాదుల 'స్వర్గ' మిది !
వడ్డించేవాడు మనోడేలే ! ఇంట్లోనే 'సెటిల్' చేసి
ఆస్పత్రిలో దొరబిడ్డలా చూసుకునే 'ఆతిథ్య' మిది !
సమానత్వం, స్వేచ్ఛ, ధర్మం, చట్టం, రక్షణ
సోయగం, స్వర్గం, ఆతిథ్యం వెల్లివిరిసే
దేవుడి రాజ్యమిది ! ఔను ! ఇది దేవుడి రాజ్యమే !
సందేహమెందుకు ! ప్రశ్నలెందుకు !
అన్ని ప్రశ్నలకూ 'దబాయింపు' సమాధానమే !
అన్ని ఉద్యమాలకూ 'బుల్‌డోజర్' ఉక్కుపాదమే !
అన్ని హత్యలకూ 'ప్రభుత్వ' నష్టపరిహారమే !
ఇంకేం కావాలి ? ఇంతకన్నా ఏం కావాలి?

ఎ. రఘునాథ్ రెడ్డి

అవినీతి పడగనీడ
అంతర్జాతీయ సంస్థల క్రీడ

ఓ మంచి పుస్తకం

జాన్ పెర్కిన్స్

"ఎకనమిక్ హిట్‌మన్‌లకు వేతనాలు పుష్కలంగా ఉంటాయి. దేశాలకు దేశాలనే లక్షల కోట్ల డాలర్ల కొద్దీ మోసం చేయటం వీరి వృత్తి. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ వంటి పలు 'సహాయక' సంస్థల నుండి వచ్చే కోట్లాది డాలర్లను బహుళజాతి కంపెనీలు, కొద్దిమంది అతి సంపన్న కుటుంబాల బొక్కసాల్లోకి మళ్లించటం ఈ వృత్తి స్వభావం. ఈ సంపన్న కుటుంబాలు, బహుళజాతి సంస్థలే భూగోళం మీద ఉన్న ప్రకృతి వనరులన్నింటినీ కబ్జా చేస్తున్నాయి. తప్పుడు ఆర్థిక నివేదికలు తయారు చేయటం, ఎన్నికల్లో రిగ్గింగుకు పాల్పడటం, భారీ ముడుపులు చెల్లించటం, శృంగారం, దోపిడీ, హత్యలు వీరి ఆయుధాలు. సామ్రాజ్యవాదం ఎంత పురాతనమైనదో వీళ్లు ఆడే ఆటలు కూడా అంతే పురాతనమైనవి. మార్పల్లా ఏమిటంటే ఈ ఆట ప్రపంచీకరణ యుగంలో మరింత భయానకంగా మారింది.

నేను కూడా ఎకనమిక్ హిట్‌మన్ అన్న విషయాన్ని నేను తెలుసుకోవాలి."



'కన్‌ఫెషన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్‌మేన్' అన్న పుస్తకంలో ('ఒక దళారి పశ్చాత్తాపం' పేరుతో తెలుగులో వెలువడింది) నా వృత్తి గురించి రాసిన మాటలే ఇవి. 2004 నవంబరులో ఈ మాటలు రాశాను. అప్పటి నుండీ నేటి వరకు అనేకమంది టీవీ కార్యక్రమ నిర్వాహకులు, రేడియో చర్చాగోష్ఠుల నిర్వాహకులు ప్రేక్షకులకు నన్ను పరిచయం చేయటానికి ఈ పదాలనే ఉపయోగించటం లెక్కకు మించినన్ని సార్లు విన్నాను. ఎకనమిక్ హిట్‌మాన్ వెల్లడించిన వాస్తవాలు అమెరికాతో సహా అనేక దేశాల ప్రజలను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తాయి.

2003 చివరికల్లా నా రాతప్రతిని పలువురు ప్రచురణకర్తలకు పంపించాను. ఒక దశలో ఈ ప్రచురణ వెలుగు చూస్తుందన్న విషయంలో నేను ఆశలు వదులుకున్నాను. ఈ కథ చెప్పాల్సిందే, అద్భుతమైన వర్ణన, కీలక రహస్యం అని పొగుడుతూనే ఒకరి తర్వాత ఒకరుగా 25 మంది ప్రచురణకర్తలు దీన్ని తమ సంస్థ ద్వారా ప్రచురించేందుకు తిరస్కరించారు.

చివరకు ధైర్యం గల స్వతంత్ర ప్రచురణకర్త బెర్రెట్ కొహ్లెర్ ఈ పుస్తకం ప్రచురించేందుకు ముందుకు వచ్చాడు. ఈ ఒప్పుకోళ్ల పట్ల ప్రజలు చూపించిన విశేష ఆసక్తి మమ్మల్ని తబ్బిబ్బు చేసింది. పుస్తకం విడుదలైన మొదటి వారంలోనే అమెజాన్ డాట్‌కాం అమ్మకాల్లో నాల్గోస్థానం ఆక్రమించింది. తర్వాత చాలా రోజుల పాటు బెస్ట్‌సెల్లర్స్ జాబితాలో ఉంది. కేవలం 14 నెలల వ్యవధిలో అనేక భాషల్లోకి తర్జుమా చేయబడింది. ఈ కథను సినిమాగా మల్చుకునేందుకు ప్రముఖ హాలీవుడ్ కంపెనీ హక్కులు కొనుక్కొంది. పేపర్‌బాక్ ప్రచురించే హక్కులను పెంగ్విన్ సంస్థ కొనుక్కొంది.

ఈ పుస్తకం ఇంత పెద్ద విజయం సాధించినప్పటికీ ఒక ముఖ్యమైన విషయంలో లోపం కొనసాగుతూనే ఉంది. ఈ పుస్తకం మార్కెట్లోకి వచ్చాక ఎకనమిక్ హిట్‌మాన్, గుంటనక్క, కార్పొరేట్‌స్వామ్యం అన్న పదాలు ఇప్పుడు కళాశాలలు, పాఠశాలల బోధనాంశాల్లో ప్రవేశించాయి. అయినా అమెరికాలోని ప్రధాన పత్రికలు, ప్రసారసాధనాలు ఈ పుస్తకం గురించి చర్చించటానికి నిరాకరించాయి. అంకెలెప్పుడూ అబద్ధం చెప్పవు కదా. చివరకు న్యూయార్క్ టైమ్స్ పత్రిక తన బెస్ట్ సెల్లర్స్ జాబితాలో ఈ పుస్తకాన్ని చేర్చాల్సి వచ్చింది. కానీ పుస్తకం మార్కెట్‌లోకి వచ్చిన మొదటి 15 నెలల పాటు దీని గురించి సమీక్ష చేయటానికే ప్రధాన పత్రికలు సిద్ధం కాలేదు. ఈ పుస్తకం గురించి చదివి సమీక్షలు రాయటానికి సిద్ధమైన ప్రఖ్యాత రచయితలు, విమర్శకులు, విశ్లేషకులందరినీ కొన్ని శక్తులు కొనేశాయి. వారు సమీక్షలు రాయకుండా చేశాయి. వీళ్లంతా సమీక్షకోసం అవసరమైన ఇంటర్వ్యూలు తీసుకున్నారు. చివరకు సమీక్షించటానికి మాత్రం తిరస్కరించారు. మీడియా ప్రతినిధులంతా వేసిన ప్రశ్న ఒక్కటే. "మరో ఎకనమిక్ హిట్‌మాన్ ఉన్నట్లు మీరు రుజువు చేయగలరా? ఒక వేళ ఉంటే అటువంటి వాళ్లు తమ అనుభవాలు రాశారా? మరెవ్వరైనా ఈ విషయాలు రాశారా?" అని ప్రశ్నించేవారు.

ఈ ప్రశ్నలన్నింటికీ అవునన్నదే నా సమాధానం. ఈ పుస్తకంలో ప్రచురించిన ప్రతి ముఖ్య సంఘటన గురించి అనేకమంది ఇతర రచయితలతో విపులంగా చర్చించాము. ఇరాన్ అధ్యక్షులు మొస్సాదిగెకు వ్యతిరేకంగా సిఐఎ కుట్ర, అతన్ని గద్దె దించటానికి సాగించిన అకృత్యాలు, అణచివేతలు, బడా చమురు కంపెనీల చేతుల్లో కీలుబొమ్మలు, షా, సౌదీ అరేబియా నిధులు దారి మళ్లించే వ్యవహారం, ఈక్వెడార్ అధ్యక్షులు జైమె రోల్డో, పనామా అధ్యక్షులు ఒమర్ టొర్రిజోస్‌ల హత్యకు కుట్ర పన్నిన గుంటనక్క, అమెజాన్ అడవుల్లో క్రైస్తవమత ప్రచార సంస్థలు, అంతర్జాతీయ చమురు కంపెనీలతో కుమ్మక్కు కావటం, అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థకు పునాదులుగా ఉన్న బెచెల్, హాలిబర్టన్ వంటి కంపెనీల అంతర్జాతీయ కార్యకలాపాలు, పనామాను అమెరికా ఆక్రమించుకోవటం, మాన్యుయెల్ నోరిగాను నిర్బంధించటం, వెనిజులా అధ్యక్షులు ఛావేజ్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటును ప్రోత్సహించటం వంటివన్నీ బహిరంగ సత్యాలే. అందుకే మరోమారు మరొకరెవ్వరూ వేలెత్తి చూపించే అవకాశం లేకుండా వీటన్నింటినీ పకడ్బందీగా ముందుకు తేవాలని నేను, నా ప్రచురణకర్త

నిర్ణయించుకున్నాము. అందుకు గాను నాలాగా పని చేసిన పలువురి అనుభవాలను గ్రంథస్తం చేయటం ద్వారా ఎకనమిక్ హిట్‌మెన్‌లు ఎలా పని చేస్తారో వివరించాలని నిర్ణయించుకున్నాము.

నా రచనలో ప్రచ్ఛన్న యుద్ధకాలాన్ని ప్రస్తావించాను. అమెరికాకు రష్యాతో ఉన్న వైరుధ్యం నేపథ్యంలో జరిగిన పరిణామాలకు సంబంధించిన సమాచారం అది. ఈ యుద్ధంలో నా ప్రయాణం 1981తో ముగిసింది. దాదాపు పాతికేళ్ల క్రితం అన్నమాట. అప్పటి నుండి ప్రత్యేకించి సోవియట్ యూనియన్ పతనం నాటి నుండీ సామ్రాజ్యపు ఎత్తుగడలు మారిపోయాయి. పాతికేళ్ల క్రితం ప్రచ్ఛన్న యుద్ధకాలంలో వర్ధమాన దేశాలపై పెత్తనం సంపాదించటానికి అమెరికా పెట్టుబడిదారీ విధానం సాగించిన ప్రయత్నాల్లో నేను కూడా ఒక పావుగా ఉన్నాను. కానీ ఇప్పుడు హిట్‌మాన్‌ల ఆట మరింత సంక్లిష్టంగా మారింది. వారి అవినీతి సర్వవ్యాప్తమైంది. వారి కార్యకలాపాలే ప్రపంచ ఆర్థిక రాజకీయాలకు కీలకంగా మారాయి. ఇటువంటి హిట్‌మెన్‌లు ఇంకా అనేకమంది అనేకరకాల వారున్నారు. **వారందరి అనుభవాల సమాహారమే 'అవినీతి పడగనీడ' అనే ఈ కొత్త పుస్తకం.**

★ ఎస్.సి. గ్ర్యెన్, క్లెవ్‌లాండ్ ట్రస్టులో ఉద్యోగి. అంతర్జాతీయ బ్యాంకింగ్ ఆనుపానులు త్వరగానే తెలుసుకోగలిగాడు. అప్పులివ్వటానికి చెల్లింపు సామర్థ్యం ప్రాతిపదిక కాదని తెలుసుకున్నాడు. "డబ్బులు అమ్మటం - ఆధారపడటం - రుణ వలయాన్ని సృష్టించటం" అన్న వ్యాసంలో వాణిజ్య అవినీతి సంస్కృతి గురించి వివరిస్తాడు. ఇందులో ఆయా దేశాల్లోని ఆధిపత్యవర్గాలు అంతర్జాతీయ బ్యాంకులు ఈ అవినీతి సంస్కృతిలో పోషిస్తున్న పరస్పర ప్రోత్సాహకర పాత్ర గురించి తెలియచేస్తాడు. ఎప్పటిలాగానే ఈ రుణాల చెల్లింపు భారం సాధారణ ప్రజలపై మోపేదే.

★ బ్రిటిష్ ఛానల్ దీవుల్లో ఒకటైన జెర్సీ కేంద్రంగా పని చేస్తున్న ఒక ట్రస్టు కంపెనీలో పని చేస్తాడు జాన్ క్రిస్టెన్‌సెన్. అక్కడ హిట్‌మాన్‌ల ప్రపంచాన్ని చూస్తాడు. పన్నుల ఎగవేత, పెట్టుబడి పలాయనం, అక్రమ పద్ధతుల్లో డబ్బులు చేరవేయటం వంటి పనులు అంతర్జాతీయ ఆఫ్‌షోర్ బ్యాంకింగ్‌లో అంతర్భాగం గావటం చూస్తాడు. "పాపపు సొమ్ము" అన్న వ్యాసంలో వర్ధమాన దేశాల నుండి లక్షలాది కోట్ల డాలర్లు ఎలా తరలించబడతాయి, విలాసవంతమైన జీవితాలను ఎలా ప్రోత్సహిస్తాయి, అతను ఆ ట్రస్టు నుండి ఎందుకు బయటకు వచ్చాడో వివరిస్తాడు.

★ సీమాంతర బ్యాంకింగ్, రహస్య బ్యాంకింగ్ కార్యకలాపాల్లో రెండు దశాబ్దాలకు పైగా పని చేస్తున్న సంస్థ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ అండ్ కామర్స్ ఇంటర్నేషనల్ (బిసిసిఐ) సిఐఏ మొదలు మెడెలిన్ ముఠా వరకు, చివరకు ఒసామా బిన్ లాడెన్, అల్‌ఖైదా వరకు పలు సంస్థలకు ఈ బ్యాంకు ఏ విధంగా లావాదేవీలు నిర్వహిస్తుందో వివరిస్తాడు. ఈ లావాదేవీల్లో ఒక్కటి కూడా రికార్డుల్లోకి ఎక్కవు. అంతా అక్రమ లావాదేవీలే. "బిసిసిఐ - డబుల్ గేం"లో ఈ బ్యాంకు ఏ విధంగా ఎగిసిపడిందో లూసీ కోమిసార్ వివరిస్తాడు. చివరకు 13 బిలియన్ డాలర్ల మేర ఈ బ్యాంకు దివాళా తీసింది.

★ ప్రపంచంలోని అతి పేద దేశాల్లో కాంగో ఒకటి. గత పదేళ్లలో దేశంలో అంతర్గత కలహాల్లో దాదాపు 40 లక్షల మంది పౌరులు చనిపోయారు. అంతర్జాతీయ బహుళజాతి కంపెనీల స్థానిక సాయుధ ముఠాలకు పెద్దఎత్తున నిధులు అందించటం ద్వారా ఆ దేశంలో ఉన్న బంగారం, వజ్రాలు, కొల్టాన్ గనులపై పెత్తనాన్ని మాత్రం కొనసాగిస్తున్నాయి. "కారుచౌక సెల్‌ఫోన్లకు బలవుతున్న ప్రాణాలు" అన్న వ్యాసంలో కథ్లీన్ కెర్న్ సంపన్న దేశాల ప్రజలకు చౌకగా ఎలక్ట్రానిక్ సామాను అందించటానికి కాంగో ప్రజలు ఎలా బలవుతున్నారో ప్రత్యక్ష సాక్షి కథనాన్ని వివరిస్తారు.

★ రానున్న పదేళ్లలో అమెరికా చమురు అవసరాల్లో 30 శాతం ఆఫ్రికా తీరుస్తుంది. అయితే ఈ వనరులను సేకరించటంలో అమెరికా, బ్రిటన్‌కు చెందిన చమురు కంపెనీలతో చైనాతో పోటీ పడాల్సి ఉంటుంది. ఈ నూతన వనరుల్లో తమకూ వాటా కావాలని, పర్యావరణ విధ్వంసాన్ని నియంత్రించాలని స్థానిక జాతులు పోటీపడుతున్నాయి. "ఆఫ్రికా నవసంపద సేకరణలో ప్రథమ శ్రేణి సైనికులు" అన్న వ్యాసంలో జేమ్స్ మార్రియట్,ఆండ్రూ రోవెల్ చమురు కోసం అధికారం కోసం జరుగుతున్న పోరాటంలో బ్రిటన్‌కు చెందిన ఉన్నత రక్షణాధికారి అనుభవాలను గ్రంథస్థం చేస్తారు.

★ ఇరాక్ ప్రపంచంలో రెండో చమురు భాండాగారంగా గుర్తింపు పొందింది. ఈ చమురు వనరులపై పెత్తనం సంపాదించుకోవటం అమెరికా విదేశాంగ నీతిలో కీలక వ్యూహం. ప్రస్తుతం అక్కడున్న వెన్నెముక లేని ప్రభుత్వం బ్రిటిష్, అమెరికా కంపెనీలతో చమురు వెలికితీత ఒప్పందాలు కుదుర్చుకోనుంది. దీనివల్ల ఇరాకీ ప్రజలకు 200 బిలియన్ డాలర్ల మేర నష్టం వస్తుంది. ఈ ఒప్పందాల వల్ల జాతి పునఃనిర్మాణానికి అవసరమైన ఈ మొత్తం అందుబాటులో ఉండవు. "ఇరాకీ చమురు నిల్వల హైజాక్" లో ఈ ఒప్పందం తుది రూపం తీసుకోవటంలో హిట్‌మెన్‌ల పాత్ర గురించి గ్రెగ్ మటిట్ అనేక విషయాలు మనముందుకు తెస్తాడు.

★ "డబ్బులు తెచ్చారా" అంటూ ప్రపంచ బ్యాంకు అధికారినొకరిని లైబీరియా అధికారి ప్రశ్నించాడు. ఈ ప్రశ్న వెనక మర్మం స్పష్టమే. "ప్రపంచ బ్యాంకు - 100 బిలియన్ల ప్రశ్న" అన్న వ్యాసంలో బ్యాంకు ఇచ్చే రుణ సహాయం అవినీతిపరులు, ఆధిపత్య వర్గాల బొక్కసాల్లోకి వెళ్తుంటే ప్రపంచ బ్యాంకు గుడ్లప్పగించి ఎందుకు చూస్తుందో వివరిస్తాడు బెర్క్‌మాన్.

★ ప్రపంచబ్యాంకు రూపొందించిన అభివృద్ధి నమూనాకు ఆధునీకరణకు 70దశకంలో ఫిలిప్పీన్స్‌ను ఉదాహరణగా చెప్పేవారు. "ఫిలిప్పీన్స్ - ప్రపంచబ్యాంకు - వాస్తవాలు" అన్న వ్యాసంలో ఎల్లెన్ ఆగస్టీన్ వేల కోట్ల డాలర్లతో మార్కోస్ ప్రభుత్వాన్ని నిలబెట్టటం అమెరికా బహుళజాతి కంపెనీలకు ఎంత ప్రాధాన్యత కలిగిన అంశమో, ప్రపంచ బ్యాంకు ఈ విషయంలో ఏ విధంగా తైనాతీగా వ్యవహరిస్తోందో వివరిస్తాడు.

★ ఎగుమతి రుణ సంస్థలకు ఉన్న పని ఒక్కటే. సంపన్న దేశాల బహుళజాతి కంపెనీలను మరింత సంపన్నవంతంగా మార్చటమే. అందుకు గాను ఈ సంస్థల ఉత్పత్తులు, సేవలు పేద దేశాల్లో అమ్మటానికి వీలుగా రంగం సిద్ధం చేయటం ఈ సంస్థల బాధ్యత. "విధ్వంసం ఎగుమతి" అన్న వ్యాసంలో బ్రూస్ రిచ్ ఎగుమతి రుణ సంస్థల రహస్య ప్రపంచం, అంతర్గత కలహాలతో మగ్గిపోతున్న దేశాలకు ఆయుధాలు సరఫరా చేయటం, బలహీనమైన దేశాలకు అణు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను అమ్మటం ద్వారా ఎంత హాని కలుగ చేస్తున్నారో మన దృష్టికి తెస్తాడు.

★ గ్లినెగ్లెస్‌లో జి8 దేశాల ఆర్థిక మంత్రుల సమావేశానికి ముందు మూడో ప్రపంచ దేశాల రుణభారంలో 40 బిలియన్ డాలర్ల రుణాన్ని మాఫీ చేయనున్నట్లు ప్రకటించారు. మాజీ అంతర్జాతీయ బ్యాంకరు కూడా అయిన జేమ్స్ ఎస్. హెన్రీ "రుణమాఫీ ఎండమావి" అన్న వ్యాసంలో నిజానికి అమలు జరిపిన రుణమాఫీ నామమాత్రమే అన్న వాస్తవాన్ని మనదృష్టికి తెస్తాడు. పశ్చిమదేశాల రుణవల(యం)లో చిక్కుకున్న పేద దేశాల దుస్థితి ఏమిటో తెలియచేస్తాడు.

★ చివరకు కార్పొరేట్‌స్వామ్యపు ఆధిపత్యాన్ని ప్రతిఘటించటానికి మీరేమి చేయాలో తెలుసుకోవటానికి గాను ఆంటొనియా జుహాజ్ రాసిన "అంతర్జాతీయ ప్రతిఘటన" వ్యాసం చదవండి. ❋



విజ్ఞాన వీచిక

మొక్కల నుండి జెట్ ఇంధనాలు

డా॥ కాకర్లమూడి విజయ్



సోలాజైమ్ అనే సంస్థ ఆల్గే నుండి జెట్ ఇంధనం తయారు చేసింది. ఇటువంటి జీవ ఇంధనాలు సాధారణంగా కాస్త తక్కువ ఉష్ణోగ్రత దగ్గర గడ్డకడతాయి (కొబ్బరి నూనెలా). కానీ ఆల్గే నుండి రూపొందిన ఇంధనంతో అటువంటి సమస్యలేదు. అయితే ఈ ఇంధనాన్ని భారీ స్థాయిలో ఉత్పత్తి చేయడానికి అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయడానికే భారీ స్థాయి ఖర్చు వుంటుందని అంచానా.

భూగర్భంలో నుండి తైలం తీయడం, దాన్ని మన అవసరాలకు వినియోగించుకోవడం అతి మామూలు విషయం అయిపోయింది. అటువంటి తైలపు ఇంధనాలు - పెట్రోలు, డీజిల్, కిరోసిన్ నిరంతరం లభించే అవకాశం తగ్గిపోతోందన్న ప్రమాద ఘంటికలు మోగటం మొదలవ్వగానే మొక్కల నుండి ఇంధనాన్ని తయారు చేసే దిశగా మానవ మేధ ప్రయత్నాలు ప్రారంభించింది. జెట్రోప్రా వంటి చెట్లు కొంతమేరకు ఒకరకమైన విజయాన్ని ఇచ్చాయనే చెప్పాలి.

ఆ మాటకొస్తే మొక్కలు/చెట్ల ద్వారా నూనె రావడం, దాన్ని మనం వాడుకోవడం కొత్త విషయాలేమీ కాదు. కాకపోతే అటువంటి నూనెల్ని మన 'బయటి' అవసరాలకు ఇంధనంగా కన్నా మన శరీరపు ఇంధనంగా వంటల్లో వాడటం మనకు అలవాటైంది. అప్పటికీ చమురు దీపాల్ని వాడుతూనే ఉన్నామనుకోండి.

ఇప్పుడు తాజాగా ఉత్తర దకోటాలోని రసాయన ఇంజనీర్లు కొబ్బరికాయలు, సోయాబీన్స్ నుండి జెట్ విమానాల కోసం ఇంధనాన్ని తయారు చేయడంలో విజయం సాధించారు. అమెరికా ప్రభుత్వం జరిపిన అనేక పరీక్షల్లో ఈ కొత్తరకం ఇంధనానికి, ఇంతవరకూ జెట్ విమానాల్లో వాడే ఇంధనానికీ తేడా కనుక్కోలేక పోవడం విశేషం.

రసాయన స్వభావాల్లో ఒకేరకంగా ఉండే ఈ మొక్కల నూనె ఇంధనాలను ఏ విధంగా తయారు చేస్తారో వివరించకపోయినా, ఈ మొక్కల నూనెలను ఒక రహస్య క్యాటలిస్టుతో వేడి చేసి, ఈ ఇంధనాన్ని తయారు చేస్తారని తెలిసింది. అయితే ఈ ప్రక్రియకు పెట్రోలియం ఉత్పత్తుల శుద్ధీకరణకు అయ్యే ఖర్చంత కావచ్చు, కాస్త తక్కువ కూడా అయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే దీనిలో సల్ఫర్ వంటి వ్యర్థాలను వేరుచేయనవసరం లేదు.

ప్రస్తుతానికి ఈ కొత్త ఇంధనం కొన్ని గాలన్లు మాత్రమే తయారైంది. ఒక్క అమెరికాలోనే రోజుకు 60 మిలియన్ గాలన్లు (దాదాపు 225 మిలియన్ లీటర్లు) జెట్ ఇంధనం వినియోగిస్తున్నారు.

ఇదిలా ఉంటే సోలాజైమ్ అనే సంస్థ ఆల్గే నుండి జెట్ ఇంధనం తయారు చేసింది. ఇటువంటి జీవ ఇంధనాలు సాధారణంగా కాస్త తక్కువ ఉష్ణోగ్రత దగ్గర గడ్డకడతాయి (కొబ్బరి నూనెలా). కానీ ఆల్గే నుండి రూపొందిన ఇంధనంతో అటువంటి సమస్యలేదు. అయితే ఈ ఇంధనాన్ని భారీ స్థాయిలో ఉత్పత్తి చేయడానికి అవసరమైన వ్యవస్థను ఏర్పాటు



చేయడానికే భారీ స్థాయి ఖర్చు వుంటుందని అంచానా.

అటువంటి వ్యవస్థే కనుక వస్తే, కొబ్బరి పంట, సోయా చిక్కుడు పంటల కోసం అరణ్యాలు చదును చేయడమూ, ఎప్పుడైపోతుందో తెలీని శిలాజ ఇంధనం కోసం భారీ ఖర్చు చేసి తవ్వకాలు సాగించడమూ మాని నాచుని (ఆల్గే) తీసుకొచ్చి ఇంధనాన్ని తయారు చేయవచ్చు. ఇది త్వరలో సాకారమౌతుందని ఆశిద్దాం.

✻

వీరి వీరి గుమ్మడి పండు

జవాబు

ఈ ఫోటోలో ఉన్నది త్రిష



హిప్నో కమలాకర్

ఫోన్ నెం.9390044031

ఎవరూ ప్రోత్సహించరు!



నా వయస్సు 20 సంవత్సరాలు. ఇంటర్ రెండో సంవత్సరంలో ఒక సబ్జెక్టు తప్పాను. మా అన్నయ్య చదువుకున్నప్పటికీ నా చదువు విషయంలో తనేమీ చెప్పడు. మొన్న ఇన్‌స్టెంట్ ఎగ్జామ్ రాశాను. అది పూర్తవుతుందో లేదో నాకు నమ్మకం లేదు. మా సార్లందరూ ఈ సారి పాసవుతానంటున్నారు. ఇంట్లో అమ్మ మాత్రమే ప్రోత్సహిస్తుంది. నేను ఇతరులను చదువు విషయంలో బాగా ప్రోత్సహిస్తాను. కానీ నన్ను మాత్రం ఎవరూ ప్రోత్సహించరు. ఈ విషయమై చాలా ఫీల్ అవుతున్నాను. నా ఆలోచన సరైందా! కాదా!! దయచేసి సలహా ఇవ్వగలరు.

శ్రీ, ఒంగోలు.

ఎవరో వస్తారని ఏదో చెబుతారని, ప్రోత్సహిస్తారని ఎదురు చూస్తూ నీకున్న శక్తిని కూడా వృథా చేస్తున్నావు. నీ మైండ్ నీకు అనుకూలంగా పనిచేయాలంటే అది నీకు వ్యతిరేకంగా పనిచేయకుండా జాగ్రత్త పడాలి. 'నేను చదవలేను, మార్కులు రావు' అని అనుకుంటే మైండ్ కూడా అలాగే వ్యతిరేకంగా పని చేస్తుంది. నిన్ను మీ అమ్మగారు ప్రోత్సహిస్తున్నారు. అంతకన్నా కావాల్సింది ఏముంది?! మీ సార్లకి కూడా నీ మీద నమ్మకం ఉంది. కానీ నీ మీద నీకు నమ్మకం లేదు. నీ మీద నీకు నమ్మకాన్ని పెంచుకుని సంపాదించుకున్న జ్ఞానమే విజయానికి రహదారి అవుతుంది. బెస్ట్ ఆఫ్ లక్.

గతం మర్చిపోవాలంటే...

నేను, నా భార్య ఇద్దరం డిఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాం. అయితే గత డిసెంబర్‌లో మాకు ఇద్దరు కవల పిల్లలు కడుపులోనే జాండిస్‌తో చనిపోయారు. ఆపరేషన్ సమయంలో నా భార్యకు పోస్ట్ పార్టమ్ సైకోసిస్ వచ్చిందని ఒక సైకియాట్రిస్ట్ చెప్పారు. మందుల ద్వారా మామూలుగా మారింది. కానీ ఇప్పుడు చదివినా గుర్తు వుండటంలేదు. పిల్లలను మర్చిపోవడంలేదు. ప్రస్తుతం మేము జీవితంలో స్థిరపడలేదు. మా ఇద్దరిలో ఒక్కరికైనా డిఎస్సీలో జాబ్ రావాలి. ఎలా చేస్తే గత విషయాలు మర్చిపోయి ప్రస్తుతం డిఎస్సీ చదువుతుందో దయచేసి తెలుపగలరు.

బాబూరావు, కీసర.

స్పందించి బాధపడే వ్యక్తులు పూర్ మెమరీని ప్రదర్శిస్తారు. మీ భార్య బాలింతగా వున్నప్పుడు వచ్చిన "మెటర్నల్ బ్లూస్" లేదా "పోస్ట్ పార్టమ్ సైకోసిస్" సమస్య నుంచి కుదుటపడటానికి కొంత వ్యవధి పడుతుంది. కుటుంబ వ్యవహారాలు, ముఖ్యంగా మీ ప్రేమ, ఆప్యాయతలు సరిగ్గా ఉన్నపుడు త్వరగా తగ్గడానికి అవకాశం ఉంటుంది. "డిప్రెషన్" ప్రక్రియలో కొన్ని సంగతులను వారి అంతరంగం కావాలనే అణచివేస్తుంది. కాన్షస్ మైండ్‌కు గుర్తుకు రాకుండా చేస్తుంది. పలు మానసిక, శారీరక వ్యాధుల ప్రభావం చేత జ్ఞాపక శక్తి ప్రభావితమౌతుంది. కాబట్టి కొంత కౌన్సెలింగ్ అవసరమవుతుంది. ఈ మానసిక పరిస్థితుల నుంచి ఉపశమనం పొందటానికి సైకోథెరపి, బిహేవియర్ థెరపి, హిప్నో థెరపి, రిలాక్సేషన్ ప్రక్రియలతో చక్కగా కుదురుతుంది. కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌ని కలవండి.

తలపులనిండా తనే



నేను బి.కామ్ రెండవ సంవత్సరం చదువుతున్నాను. నేను గత 3 సంవత్సరాలనుండి ఒక అమ్మాయిని గాఢంగా ప్రేమిస్తున్నాను. కానీ తనకు చెప్పాలంటే భయం. అయితే ఎప్పుడూ తన గురించి ఆలోచిస్తూ నా జీవితంలో ఎన్నో విలువైనవి కోల్పోయానని నేను ఇప్పుడు తెలుసుకున్నాను. 'బాగా చదవాలి' అనుకున్నా బుక్‌లో తనే కనిపిస్తుంది. అలాగని ఆ అమ్మాయికి చెప్పలేను. దయచేసి నాకు సలహా ఇవ్వండి.

కె.వి.ఆర్, మచిలీపట్నం.

జీవితంలో ప్రతి క్షణం విలువైనదే. పోయిన క్షణం తిరిగిరాదు. ప్రేమ అవసరమే. కానీ ఒక పక్క అదే ప్రేమ జీవితాన్ని నాశనం చేస్తోంది. మీరు మిమ్మల్ని, మీ చదువుని ప్రేమించండి. జీవితంలో మనకు ఎదురయ్యే ఏవో కొన్ని మాత్రమే మనకు తోడ్పడతాయి. జీవితం పట్ల మీకున్న అవగాహన, ఏర్పరుచుకున్న దృక్పథం, దాని పట్ల మీరు ఏర్పరచుకున్న వైఖరి ... వీటిని అనుసరించి తీసుకునే నిర్ణయాలవల్లే మీరు విజయ పంథాలో ప్రయాణించగలుగుతారు. ఎన్ని ఆలోచనలు వచ్చినా చదువు మీద దృష్టి పెట్టండి. సొంతగా నోట్సు రాయండి. స్నేహితులతో కలిసి పాఠ్యాంశాలు చర్చించండి. అలా కొన్ని రోజులు చేస్తే తరువాత బాగా చదువగలరు. అవసరమైతే కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌ను కలవండి. ఆల్ ద బెస్ట్.

స్కూల్ ఫస్ట్ రావాలంటే....

మా పిన్ని కొడుకు నా కన్నా ఒక సంవత్సరం సీనియర్. వాళ్ల క్లాస్‌లో అతనే ఫస్ట్. నేను కూడా అతనిలా క్లాస్ ఫస్ట్ రావాలని కోరుకుంటున్నాను. ఎంత బాగా చదివి, పరీక్షలు రాసినా చాలా తక్కువ మార్కులు వస్తున్నాయి. వచ్చే సంవత్సరం పదవ తరగతిలో మంచి మార్కులతో స్కూల్ ఫస్ట్ రావాలన్నదే నా కోరిక. ఎలా చదవాలో, ఏం చేయాలో తెలుపగలరు?

జీవన్ కుమార్, నాగోల్.

నువ్వు బాగా చదివే అబ్బాయివి. కానీ నువ్వు ఎవ్వరితోనూ పోల్చుకోవద్దు. ఒకరితో పోల్చుకోవడం వల్ల మెదడులో ఒత్తిడి ఏర్పడి సరిగ్గా చదవలేరు. పరీక్షలు రాయలేరు. ఆరోగ్యవంతమైన, ప్రశాంతమైన నిద్ర వల్ల మెదడుకు చక్కని విశ్రాంతి లభిస్తుంది. ఫలితంగా సెరిటోనిన్ ఎంజైమ్ చురుగ్గా స్రవిస్తుంది. కాబట్టి విశ్రాంతి తదనంతరం చదువుకోవడం వల్ల శాశ్వత ప్రయోజనాలు ఏర్పడతాయి. ఉదయం పూట లేచి చదువుకోవటం వల్ల ఎక్కువ విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవచ్చు. విశ్రాంతి తీసుకుంటూ చదువుకో. తెలివిగా టైం మేనేజ్‌మెంట్ చేసుకుంటూ మైండ్‌ని ఫ్రెష్ చేసుకుంటూ చదువుకో. అనేక విషయాల కన్నా మనసులోని ప్రశాంతతలే గొప్ప పరిష్కార మార్గంగా గ్రహించు. క్రమశిక్షణ, టైం మేనేజ్‌మెంట్ సరిగా ఉండేలా చూసుకో. నీ గురించి ఆలోచించు. అర్థం కాకపోతే టీచర్లని అడుగు. అప్పుడే నువ్వు అనుకున్న విధంగా ఫస్ట్ వస్తావు.

✻



లోగిలి లోగిలిలో...

మన సినిమాల్లో "శాంతి దూత గాంధీజీ!"

డా॥ జె.పి. వైద్య



బెన్‌కింగ్స్ లే

'గాంధీ'...!

బ్రిటీష్ ప్రధాని 'చర్చిల్'- భారత దేశపు 'నంగా ఫకీర్' అని దాదాపుగా ఈసడిస్తూ పలికిన మాటలు...!

రక్త మాంసాలున్న ఇలాంటి అరుదైన వ్యక్తిత్వం నిజంగా ఈ పృధ్వీమీద అవతరించి కేవలం సత్యం, అహింస అనే సూక్తి మంత్రాలతో ఇంతటి ప్రళయాన్ని శాంతియుతంగా సాగించి, సాధిస్తాడని చరిత్రలో రాస్తే వచ్చే తరాలు కూడా నమ్మకపోవచ్చు అని ప్రపంచం వేనోళ్ల పొగిడింది.

బోసినవ్వు...!

కృశించిన బక్కపల్చటి శరీరం...!

నడుంకో గుడ్డ..! భుజాల మీద మరో చిన్న గుడ్డా....!

చేతి కర్ర....!

మనస్సులో అచంచల ఆత్మ విశ్వాసం...! సత్యం, అహింస, ఖద్దరు లాంటి మూల మంత్రాలతో రవి అస్తమించని సామ్రాజ్యవాదులను కూకటి వేళ్లతో పీకి పారేసిన శాంతి దూత...!

నేడు యావత్ భారత దేశంలోని ప్రతి చిన్న గ్రామ కూడలిలోనూ ప్రతి ఇంట్లోనూ, ప్రతి గుండెలోనూ గూడు కట్టుకున్న 'గాంధీ మహాత్మ' మన జాతిపిత!

సినిమా జీవులకూ ఆకర్షణ కేంద్రం!

నిజంగా ఇక్కడి మట్టినేల సుగంధాలను తెర మీదికెక్కించే మన సినిమావాళ్లు 'గాంధీ' గారి కోసం ఎంత చేశారో కానీ - విదేశీయుడైన 'సర్ రిచర్డ్ ఎటిన్‌బరో' మటుకు ఒక గొప్ప సినీ చమత్కారం చేసి చూయించాడు.

బ్రిటీష్ నటుడు 'బెన్ కింగ్స్‌లే' అచ్చం మన భారతీయత ఉట్టిపడే 'గాంధీ'ని వెండితెర మీద సజీవంగా మలిచాడు. యావత్ ప్రపంచంలో 'గాంధీ'ని తెరమీద అమరుడు చేశాడు. 1982 వరకు 'బెన్ కింగ్స్‌లే' ఒక సాదాసీదా టీవీ కళాకారుడు మాత్రమే!

1983లో గాంధీ పాత్రతో ఆయన ప్రపంచ సీమలో వెలిగిపోయాడు. ఆ వెలుగుల వెనక ఎంతో ఆత్మ విశ్వాసం, అంకుఠిత శ్రమ, కఠోర పరిశ్రమలూ దాగి ఉన్నాయి.

ముందుగా ఆయన 'గాంధీ' ఆత్మతో సాక్షాత్కారం పొందేలా గాంధీ సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు. కూలంకషంగా జీర్ణించుకున్నాడు. మద్యం, మాంసం వదిలేశాడు. పూర్తిగా శాకాహారిగా మారిపోయాడు. 'ఫిల్మ్ డివిజన్' అఫీసులో గంటలు గంటలు అదే పనిగా గడిపాడు. గాంధీ గారి మీద నిర్మించబడ్డ 'న్యూస్ రీళ్లలో' - 'వృత్త చిత్రాల్లో' సూక్ష్మాతి సూక్ష్మంగా గాంధీగారి నడక, మాటా ఒంట పట్టించుకున్నాడు. అంత కష్టపడ్డందుకు 'రివార్డ్'గా 'ఆస్కార్ అవార్డు' చేజిక్కించుకున్నాడు. ఒక భారతీయ అసలు సిసలు 'గాంధీ' కోసం - బ్రిటీష్ ప్రభుత్వాన్ని కూలంకషంగా దేశం వదిలేట్టు చేసిన 'భారతీయుడి' కోసం - బ్రిటీష్ వాడైన 'బెన్ కింగ్స్ లే' అభినయం చూసి 'వహవా'... 'భళారే' అనేలా చేశాడు. ఆశ్చర్యమా!! నటనా పరాకాష్ట!!

మన భారతీయ సినీ దిగ్గజులు కూడా చిన్నవాళ్లేం కారు. భారత ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ రాసిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'ను చిన్నితెర కోసం శ్యాం బెనెగల్ 'భారత్ ఏక్ ఖోజ్' పేర్న ఒక సుదీర్ఘమైన, ఇంపైన, అత్యద్భుతమైన డాక్యుమెంటరీ నిర్మాణం చేశాడు.

'ఎటిన్ బరో' గాంధీ చిత్రం ఎక్కడ అంతమైందో - ఒక రకంగా అదే దాని ప్రారంభం...! ఫిల్మ్ అంతా 'ఫ్లాష్ బ్యాక్' లా సాగిపోంతుందని నేను

ముందుగా ఆయన 'గాంధీ' ఆత్మతో సాక్షాత్కారం పొందేలా గాంధీ సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు. కూలంకషంగా జీర్ణించుకున్నాడు. మద్యం, మాంసం వదిలేశాడు. పూర్తిగా శాకాహారిగా మారిపోయాడు. 'ఫిల్మ్ డివిజన్' అఫీసులో గంటలు గంటలు అదే పనిగా గడిపాడు. గాంధీ గారి మీద నిర్మించబడ్డ 'న్యూస్ రీళ్లలో' - 'వృత్త చిత్రాల్లో' సూక్ష్మాతి సూక్ష్మంగా గాంధీగారి నడక, మాటా ఒంట పట్టించుకున్నాడు. అంత కష్టపడ్డందుకు 'రివార్డ్'గా 'ఆస్కార్ అవార్డు' చేజిక్కించుకున్నాడు. ఒక భారతీయ అసలు సిసలు 'గాంధీ' కోసం - బ్రిటీష్ ప్రభుత్వాన్ని కూలంకషంగా దేశం వదిలేట్టు చేసిన 'భారతీయుడి' కోసం - బ్రిటీష్ వాడైన 'బెన్ కింగ్స్ లే' అభినయం చూసి 'వహవా'... 'భళారే' అనేలా చేశాడు. ఆశ్చర్యమా!! నటనా పరాకాష్ట!!

ప్రత్యేకంగా నమోదు చేయవలసిన అవసరం లేదు! 'ఎటిన్ బరో' గాంధీ ఎక్కడ ప్రారంభమౌతుందో అక్కడే 'శ్యాం బెనెగల్' గాంధీ 'సమాప్తం' అవుతుంది.

'ది మేకింగ్ ఆఫ్ మహాత్మా' (1996) మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ అనే చీమూ నెత్తురు ఉన్న మామూలు మనిషి 'మహాత్మ' దాకా ఎలా ఎదిగాడనే వృత్తాంతాన్ని సజీవ పరుస్తుంది. రజిత్ కపూర్ 'గాంధీ' పాత్రలో లీనమై జీవించాడు. ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారాన్ని స్వంతం చేసుకున్నాడు.

కేతన్ మెహతా 'సర్దార్' అనే చిత్ర నిర్మాణం చేశారు. 1933లో వెండి తెర మీద వెలిగిన 'సర్దార్' నిజంగా 'వల్లభాయ్ పటేల్' జీవిత చరిత్ర. పరేష్ రావెల్ 'సర్దార్' గా జీవించాడు. అందులో గాంధీ పాత్ర వేసింది 'అన్నూ కపూర్'!

చిన్న తెరమీద వందల కొద్ది కార్యక్రమాలను నిర్వహించిన 'సూట్ బూట్' 'అన్నూ కపూర్' గాంధీ గానూ నిలదొక్కుకున్నాడు.

మరాఠీలో తన స్వంత ఇమేజ్ నిర్మాణం చేసుకున్న "డా॥ జబ్బార్ పటేల్" ఎంతో ప్రతిభావంతుడు. 1991లో మరాఠీ లోనూ, 2000లో ఆంగ్లంలో 'డా॥సాహెబ్ నవాబ్ అంబేద్కర్' చిత్ర నిర్మాత అయన. మరాఠీ నాటకాలకు చెందిన మోహన్ గోఖలే 'గాంధీ' పాత్రను పోషించాడు. ఆయన ఆకస్మిక మరణం వల్ల 'గాంధీ పాత్ర' మరో ప్రతిభావంతుడైన 'నసీరుద్దీన్ షా' చెంత వాలింది. అయితే నసీరుద్దీన్ 'గాంధీ' కమల్ హాసన్ కాల్పనిక కథ 'హే రామ్' (2000) వరకే పరిమితం అయిపోయింది. అదీ 'సజీవ పాత్ర పోషణే!

నసీరుద్దీన్ చాలా గొప్ప నటుడు. అంకిత భావంతో గాంధీని సాకారం చేశాడు. గాంధీ పాత్రలో చాలా సార్లు రాణించిన ఖ్యాతి మటుకు నిస్సందేహంగా 'సురేంద్ర రాజన్' గారిదే !

'వీర సావర్కర్ ' (వేద్ రాహీ/2001) - ది లిజెండ్ ఆఫ్ భగత్ సింగ్' (రాజ్ కుమార్ సంతోష్/2002) - 'నేతాజీ - ది ఫర్ గాటెన్ హీరో' (శ్యాం బెనెగల్/2005) - వీటన్నింటిలో మనం చూసింది 'సురేంద్ర మోహన్' సాకారం చేసిన 'గాంధీ' గారినే!



అయితే ఆయన నాటక క్షేత్రానికే సమర్పితమైన మనిషి. సినీ సామ్రాజ్యం తళుకు బెళుకులకు దూరంగానే ఉండిపోయాడు.

ఇటీవలే హిందీ సినీ సృష్టిలో ప్రభంజనం సృష్టించిన చిత్రం 'లగే రహో మున్నా భాయ్' (2006). రాజ్ కుమార్ హీరానీ సినిమా అది. కొన్ని కారణాలవల్ల జైలు కూడు తిన్న 'సంజయ్ దత్'కు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు సంపాదించి పెట్టిన చిత్రమిది. సినిమా నిండా ముంబాయిలోని 'టపోరీ భాష' తన ప్రత్యేకతను అడుగడుగునా ప్రదర్శిస్తుంది. అందులో 'గాంధీ పాత్ర వేసి ఎనలేని పేరూ, కీర్తి స్వంతం చేసుకున్న మనిషి 'దిలీప్ ప్రభావళకర్'. ఆయన మరాఠీ సినిమాల మనిషి. టపోరీ భాష, హాస్యం ఉట్టిపడే సన్నివేశాలూ, మన్నాభాయ్ సజీవ పాత్ర చిత్రణ, ఆకట్టుకునే సంగీతం - అన్నింటికన్నా ముఖ్యంగా చిత్రం 'ఆత్మ'గా నిలిచిపోయిన గాంధీగారి 'గాంధీగిరి'.... వీటన్నింటివల్ల చిత్రం దేశ విదేశాల్లో కాసుల వర్షం వరద ప్రవాహమై పారింది.

కొందరు మూతీ, ముక్కూ విరిచి "గాంధీ గిరి' ఏమిటీ? అసహ్యంగా!!" అని ఈసడించుకున్నారు.

వారిని స్వయంగా గాంధీ గారి మనుమడు 'తుషార్ గాంధీ' వారించాడు. గాంధీ వాదులు చల్లబడ్డారు. అదంతా మామూలు మనిషి గుండె బాస...! మనస్సులను కదిలించిన టపోరీ భాష...!! అందరినీ కలిపిన గాంధీఘోష!!! ఇప్పటికీ 'గుడ్ మార్నింగ్ ముంబాయ్' అంటూ నవ్వులూ, ఆత్మీయత చిందించిన విద్యాబాలన్, 'అరేcc! ఏ గాంధీ కౌన్ హైరేcc!' అని అమాయకంగా అడిగిన టపోరీ భాషావేత్త(!) సంజయ్‌దత్, 'భాయ్! గాంధీ బోలేతో... నోటోం పర్ రహతా భాయ్...!' అంటూ తన అపార విద్వత్తను చాటిన టపోరీ దోస్త్ - 'అర్షద్ వార్సీ' ప్రతి ఇంట చేరుకున్నారు. 'రిన్ తెల్లదనం' కోసం 'ప్రూఫ్' అడిగే 'బోమన్ ఈరానీ' ప్రస్తుతం బాలివుడ్‌లో హాట్ కేక్!

గాంధీగా జీవించి అమరుడైన 'దిలీప్ ప్రభావళ్‌కర్'ను మనం అమోల్ పాలేకర్ హిందీ సినిమా 'పహేలీ'లో చూస్తాం! అందులో ఆయన పాత్ర అనుపమ్ ఖేర్ చిన్న తమ్ముడు 'కమల్ లాల్'ది. ఎంతమందికి జ్ఞాపకం వుందనీ?

గాంధీ కొడుకు 'హరిలాల్' వ్యధల మీద ఆధారపడి ఈ మధ్య మరో చిత్రం 'గాంధీ మై ఫాదర్' ఇటీవల వెండితెర మీదికొచ్చింది. అందులో 'హరిలాల్' పాత్ర అక్షయ్ ఖన్నా పోషించాడు. గాంధీ పాత్ర 'దర్శన్ జరీవాలా'ది.

కొన్ని కారణాల వల్ల 'గాంధీ మై ఫాదర్' తుస్సుమంది.

'నేను గాంధీనెందుకు చంపాను?' అని వచ్చిన 'గాడ్సే నాటకం' ముంబయ్‌లో భగ్గుమంది. గొడవల మధ్య మధ్యంతరంగా ఆగిపోయింది. ఇదంతా స్వాతంత్ర్యం తర్వాతి ముచ్చట్లు!

విదేశీ బానిస సంకెళ్లున్న కాలంలోనూ మనవాళ్లు ధైర్యంగా గాంధీవాదాన్ని చిత్రీకరించారు.

'స్వరాజ్ తోరణ్'.... అశోక్ కుమార్ నటించిన 'అఛూత్ కన్య' - 'అఛూత్' - 'వందేమాతరం' .... అలనాటి చిత్ర విచిత్రాలు.

'వందేమాతరం' ఆరోజుల్లో లతా మంగేష్కర్ వినూత్నంగా గానం చేసింది. హేమంత్ సంగీతం సుమధురంగా సాగిపోయింది.

వి. శాంతారాం ఆరోజుల్లో మరాఠీ / హిందీలో చిత్రాలు నిర్మించేవాడు. 'మహాత్మా' అని సినిమా తీశారు.

1948లోని శ్వేత శ్యామ చిత్రాల్లో వెలిగిన 'మహాత్మా గాంధీ'... అటెన్‌బరో (1983)తో దోస్తీ చేసినా - 'మున్నా భాయ్' (2006) తో టపోరీ భాషలో ముచ్చట్లు చెప్పినా - అప్పుడూ, ఇప్పుడూ కలకాలం రాణించిన 'శాంతిదూతే!'

ఎప్పుడో సంవత్సరానికి రెండు మూడు సార్లు 'గాంధీ బొమ్మ' కు పూలహారాలేసి, 'గాంధీ... గాంధీ....' అంటూ పులకించిపోయే 'మహానటులైన 'పెద్దోళ్లు' మన లీడర్ల కన్నా -

'అరేcc! నడూcc! టిక్కెట్లు దొరకయిరా...! ఉర్కూcc!' అంటూ గాంధీ సినిమాలంటే పడి చచ్చే మనం గొప్పవాళ్లం కాదా ఏమి?

❋

ఆంధ్రభాషలో 'భారత రాజ్యాంగం'

1949 నవంబర్ 26న భారత ప్రజలు భారత రాజ్యాంగ నిర్ణయ సభ, సుదీర్ఘ చర్చల అనంతరం రాజ్యాంగాన్ని ఆమోదిస్తూ , దానిని సాధికార శాసనంగా చేసి తమకు తాము అంకితం చేసుకున్న సన్నివేశం భారత రాజ్యాంగ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం... చారిత్రాత్మకం.

"సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం" గా ప్రకటించుకున్నందున పాలనావ్యవస్థలోని ప్రతి ఒక్కరూ మినహాయింపు లేకుండా పాలకుల నుంచి ప్రభుత్వ యంత్రాంగంలోని ప్రతి ఒక్క ఉద్యోగి వరకూ ఈ రాజ్యాంగం లక్ష్యాలను, ఆదర్శాలను క్షుణ్ణంగా తెలుసుకోవలసిన బాధ్యత ఉంది. తొలుత 392 అధికరణలున్న భారత రాజ్యాంగం గత అరవైఏళ్లలో మార్పులు చేర్పులతో సుమారు 444 - అధికరణలుగా రూపొంది ఇంకా అనేక సవరణలకు లోనై ముందుకు సాగుతోంది. 2006 ఆగస్ట్ 15 నాటికి భారత రాష్ట్రపతి ఆమోద ముద్ర పొంది ఉన్న సవరణల సంఖ్య 94. సరళమైన తెలుగు భాషలో ఈ రాజ్యాంగ ప్రతి హస్త భూషణంగా కాకుండా, మస్తక (మనస్సుకు) భూషణం కాగలదని ఆశించిన అధికార భాషాసంఘం, దాని అధ్యక్షులు ఎ.బి.కె నిర్వహించారు. ఉద్యోగుల్లో రాజ్యాంగ పరిజ్ఞానం పెంపొందించడం అవసరమని వక్కాణించారు. బాగానే ఉంది. కానీ కేవలం ఒక్క రాజ్యాంగ రచన అనువాదంతోనే ఆ లోపం తీరుతుందా?! ఇప్పటికే రూపొందిన అనేక చట్టాలు, నియమ నిబంధనలు, తెలుగు రూపం సంతరించుకోవటం ఎంతో అవసరం. రాజ్యాంగ, న్యాయ వ్యవహారాలకు, పాలనకు సంబంధించి సులువైన వ్యవహారిక పదాలతో తెలుగు అనువాదాలు రావాలి... అన్ని చోట్లా తెలుగే వాడాలి. కావాలి. వావిలాల గోపాల కృష్ణయ్యగారు అధికార భాషాసంఘం అధ్యక్షులుగా ఉన్ననాటి నుండి .... నేటిదాకా తెలుగు భాషా వికాసం చూస్తున్న వారికి నిరాశే మిగులుతోంది. ఎందుకంటే... తెలుగు భాషకు ప్రాచీన హోదా కావాలి అని ఒకవైపు ఉద్యమిస్తున్నాం. ... పాలనాపరంగా విద్యాపరంగా తెలుగు పూదోటలో ఆంగ్ల చిచ్చు పెట్టుకొంటున్నాం. భారత దేశంలో అత్యధిక మంది మాట్లాడే భాష తెలుగు ద్వితీయ స్థానంలో ఉంది. 15కోట్ల తెలుగువారు ఈ భూమండలంపై నివసిస్తున్నారు. ఐఏఎస్- ఐపిఎస్ పరీక్షలు తెలుగు భాషలో రాసే అవకాశం పొందాం. తెలుగు అధికార భాషగా 1966మే 14 శాసన ప్రతిపత్తి పొందింది. 1976లో శాఖాధిపతుల కార్యాలయాల్లోనూ, 1983 నుండి సచివాలయంలోనూ, తెలుగు వాడకం తప్పనిసరి చేసింది. 1988 నవంబర్ 1 శాసనపరమైన వ్యవహారాల్లో సైతం తెలుగు వాడకం తప్పనిసరి చేస్తూ శాసనం చేశారు. తెలుగు దేశ రాజధానిలో తెలుగు వైభవం గురించి ప్రత్యేకంగా రాయనక్కర్లేదు.... ఇలాంటి(దు) స్థితిలో ఎ.బి.కె. ప్రసాద్ గారు భాషాభివృద్ధికై సాగించే అక్షర యజ్ఞంలో ఎన్నో ఫలితాలు చూపారు. తేట తెలుగులో రాజ్యాంగ రచన చేసి గొప్ప కృషిని సామాన్యుల చేతిలో పెట్టారు. ఇది నిజంగా చరితార్థమైన కృషే! గతంలో కేంద్ర ప్రభుత్వం వారు "ప్రాధికార పాఠం" పేరుతో భారత రాజ్యాంగాన్ని ప్రాంతీయ భాషలలో అనువదించారు. కానీ వారు ఆంధ్రీకరించిన పదాలు, కూర్పు, అన్వయం, వినియోగించిన భాష... పదాలు అక్షరాస్యులకే ఇబ్బందిపెట్టాయి. అనువాదం కన్నా ఆంగ్లమే మిన్న అనే ధోరణిలో ఆ పుస్తకం మూలన పడింది. ఆ తరువాత అనువాదం లేదు.... ఆలోచించిన వారే లేరు... హైకోర్టు సీనియర్ న్యాయవాది పెండ్యాల సత్యనారాయణ గారి సహకారంతో అందమైన కూర్పు, అనువాదానికి ఎంచుకున్న శైలి, తేట తెలుగు పదాలు, నాటి నేతల చేవ్రాలు సంతకాలు...(ఆటోగ్రాఫ్) ముచ్చటైన ముద్రణలో భారత రాజ్యాంగాన్ని సామాన్యుల చేతికి చేర్చిన ఎ.బి.కె అభినందనీయులు.

1. కొన్ని ఆంగ్ల పదాలు యథాతథంగా కనిపించాయి... బ్రిడ్జిలు, టౌన్ ప్లానింగ్, అర్బన్ ప్లానింగ్/ అర్బన్ వనములు/ మున్సిపాలిటీలు/ రూల్స్/ రెగ్యులేషన్స్/ బైలాస్ లాంటి వాటిని మలి ముద్రణలో తెలుగు పదాలుగా ప్రచురించాలి. తెలుగు అంకెలను కూడా పరిచయం చేస్తే బాగుండేది. (హైదరాబాద్ సిటీ బస్‌లపై దర్శనమిస్తాయి) కొన్ని అధికరణలకు బ్రాకెట్లో ఆంగ్లంలో వివరణ ఉంది. అన్నింటికీ ఉంటే బాగుండేది.

2.స్పీకర్/ పేరాగ్రాఫ్/ నార్త్ కచార్ హిల్స్ డిస్ట్రిక్ట్ / ట్రైబల్ ఏరియా డిస్ట్రిక్ట్/ (పేజీ275) లాంటి పదాలు గ్రామీణ పాఠకునికి అందవు... అర్థం కావు....

3.పేజీ 192లో అధికరణ 324 అని వుండాలి కదా ! ముద్రణలో 234 అని వుంది.

4. అదే పేజీలో ఎన్నికల కమిషన్ (సంఘం) అని వుండాలి. ఎన్నికల కమిషన్ అని ముద్రణైంది.

5. పేజీ 144లో మున్సిపాలిటీలు అన్నారు. పురపాలక సంఘాలు అంటే బాగుండేది. మలి ముద్రణలో సరిచేయాలి.

6. ప్రభుత్వాలు, కోర్టు, పాలకులు, నాయకులు చేసిన, చేస్తున్న రాజ్యాంగ ఉల్లంఘనలు.. పంచాయితీ నుండి ... ప్రధాని దాకా... కొన్నింటిని ప్రజల ముందు... అనుబంధంగా ఇస్తే బాగుండేది.... మలి ముద్రణలో ఆలోచించగలరు.

వివిధ సంస్థలకు, ప్రభుత్వానికీ, శాసన వేదికకూ న్యాయవ్యవస్థకూ కేంద్రానికీ, రాష్ట్రాలకూ, స్థానిక సంస్థలకూ మధ్య సంబంధాలను నిర్వచించి నిర్ధారించేదే "రాజ్యాంగం"... సామాన్యుడు కూడా రాజ్యాంగాన్ని తేలిగ్గా అర్థం చేసుకుని స్వయంగా వాదించుకోవడానికి వీలయింది "స్వీడిష్ రాజ్యాంగం". మన దేశ రాజ్యాంగాన్ని సైతం సామాన్య వ్యవసాయ రైతు కూలీలదాకా అర్థం చేసుకోవడానికి అవకాశం కల్పించిన (ఈ గ్రంథం ద్వారా) అధికార భాషా సంఘం కృషి అభినందనీయం.... శ్లాఘనీయం.!!

రచనా పర్యవేక్షణ : డా॥ ఎ.బి.కె ప్రసాద్,
ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు,
పేజీలు : 320 ,
వెల: పేర్కొనలేదు,
ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం,
సచివాలయం , హైదరాబాద్.

-తంగిరాల చక్రవర్తి



పినలగర్ర

ఆర్. రామకృష్ణ
వెల: 50/-,
పేజీలు : 96
ప్రతులకు :
నవోదయా బుక్ హౌస్,
కాచీగూడ చౌరస్తా
హైదరాబాద్.
విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్ హౌస్
అన్ని బ్రాంచీలు



గోవాలో సముద్రం

దా. ఎన్ గోపి
వెల: 30/-,
పేజీలు : 31
ప్రతులకు :
ఎన్. అరుణ
ఇంటి నెం: 13-1/5బి,
శ్రీనివాస పురం,
రామాంతపూర్,
హైదరాబాద్.









ఒక ఐడియా చాలు

కదా... మాక్కూడా సేమ్ ఫీలింగ్. ఆ ఒక్క ఐడియా ఎవరికొచ్చిందో ఏమోగానీ....ఇదిగో నాలుగుచక్రాల వాహనాలలో కొంతభాగాలకు ఇచ్చిన రూపమే ఇవి. బాగా గమనించారో లేదో...వీటిలో మిలట్రీ జీపు దగ్గర నుంచి రకరకాల కార్లున్నాయి. వాటితోనే ఇదిగో ఇలా కుర్చీలు, సోఫాలు, గ్లాస్ టేబుళ్లు తయారుచేసేశారు. ఏమైనా ఆ బుర్రే బుర్ర, అందుకే అంటారు ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది అని. మనం కూడా బుర్రకు బాగా పదును పెడితే ఇలాంటి ఐడియాలు బోలెడన్ని వస్తాయేమో కదా. మరెందుకు ఆలస్యం ఈరోజునుంచే...కాదు కాదు ఈ క్షణం నుంచే ఆ పనిలో వుంటే బెటరేమో!

కలం స్నేహం

పేరు: టి.పూజిత
చదువు: 7వ తరగతి
వయస్సు: 12 సం॥
స్కూలు: జ్యోతి కాన్వెంట్
లక్ష్యం: టీచర్ కావటం
హాబీలు: పాటలు పాడటం,
నృత్యం చేయటం,
చదరంగం ఆడటం.
చిరునామా: టి. పూజిత
డాటరాఫ్ : టి. బాలు,
రాజుపేట కాలనీ
భద్రాచలం (మం), ఖమ్మం.

పేరు: సి.అఖిలేశ్వర్
చదువు: 4వ తరగతి
వయస్సు: 10 సం॥
స్కూలు: కోత్వాల్ హై స్కూల్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: టీవీ చూడటం,
ఆటలు ఆడటం,
డ్రాయింగ్ వేయటం.
చిరునామా: సి. అఖిలేశ్వర్
డాటరాఫ్ : యాదగిరి,
అడ్డగుట్ట, సికింద్రాబాద్.

పేరు: ఎమ్. లోకనాథం
చదువు: 9వ తరగతి
వయస్సు: 14 సం॥
స్కూలు: జవహర్
నవోదయా విద్యాలయం
లక్ష్యం: పరిశోధకుడు కావడం
హాబీలు: చదవటం,చదరంగం
ఆడటం.
చిరునామా: ఎమ్. లోకనాథం
సన్నాఫ్: వెంకటేశ్వరరావు,
చిన్న గంజాం, ప్రకాశం జిల్లా.

పేరు: సి.నిఖిత
చదువు: 1వ తరగతి
వయస్సు: 7 సం॥
స్కూలు: కోత్వాల్ హై స్కూల్
లక్ష్యం: బ్యూటీషియన్ కావడం
హాబీలు: డాన్స్, పాటలు పాడటం,
డ్రాయింగ్ వేయటం.
చిరునామా: సి. నిఖిత
డాటరాఫ్ : యాదగిరి,
అడ్డగుట్ట, సికింద్రాబాద్.

పేరు: గోసి. రాహుల్ రంజన్
చదువు: 6వ తరగతి
వయస్సు: 11 సం॥
స్కూలు: జిల్లా పరిషత్
ఉన్నత పాఠశాల.
లక్ష్యం: ఇంజనీర్ కావటం.
హాబీలు: బొమ్మలు గీయటం.
చిరునామా: రాహుల్ రంజన్
సన్నాఫ్: దయాకర్,
నార్త్ రాజుపాలెం,
కొదవలూరు(మం), నెల్లూరు.

పేరు: కె. రవీందర్
చదువు: 9వ తరగతి
వయస్సు: 14 సం॥
స్కూలు: జడ్.పి.హెచ్ స్కూల్
లక్ష్యం: కానిస్టేబుల్ కావడం
హాబీలు: చదవడం,
కబడ్డీ ఆడటం.
చిరునామా: కె. రవీందర్
బబుల్ గావ్ (గ్రా),
జుక్కల్ (మం),
నిజామాబాద్ (జి).

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్

కలంస్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్.